పునాదుల్లో ఆగిపోయిన ఆదోని మెడికల్ కాలేజీ భవనాలు



నాడు నిర్లక్ష్యం,, నేడు నిందలు

వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఆదోని మెడికల్ కాలేజీ నిర్లక్ష్యానికి గురైంది. రూ.71 కోట్లు విలువైన పనులు చేస్తే రూ.24కోట్లకు పైగా బిల్లులు పెండింగ్ పెట్టేసింది. జగన్ ప్రభుత్వం నిధులివ్వకపోవడంతో కూటమి ప్రభుత్వం రావడానికి ఏడాది ముందే కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. ఒకటి రెండు భవనాలు మాత్రం స్లాబులు వేశారు. మెజారిటీ భవనాలు పునాదులు, పిల్లర్లు వద్దే ఆగిపోయాయి. అక్కడ మెడికల్ కాలేజీ నిర్వహించేందుకు ఏమాత్రం అవకాశం లేదు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం తొలి దశలో ఐదు వైద్య కళాశాల నిర్మాణం, నిర్వహణ పబ్లిక్, ప్రైవేటు, భాగస్వామ్య (పీపీపీ) విధానంలో చేపట్టేందుకు ఆమోదం తెలిపింది. అందులో ఆదోని మెడికల్ కాలేజీ ఒకటి. తమ హయాంలోనే వైద్య కళాశాల భవనాలు మొత్తం పూర్తిచేసినట్లు, కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నట్లు వైసీపీ నాయకులు కళాశాల పరిశీలన పేరిట కూటమి ప్రభుత్వంపై అపనిందలు వేశారు. నాటి వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కప్పిపుచ్చే ఎత్తులు వేస్తున్నారు. ఆదోని వైద్య కళాశాల తాజా పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- శంకుస్థాపన చేసిన ఏడాదికి మొదలైన ఆదోని మెడికల్ కళాశాల పనులు
- రూ.71 కోట్ల పనులు చేస్తే.. రూ.24 కోట్లు బకాయి
- బిల్లులు రావని అప్పుడే చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- ఇప్పుడు పనులన్నీ పూర్తిచేసినటు వైసీపీ నేతల ప్రచారం
- జగన్ తప్పిదాలను కూటమి ప్రభుత్వంపై నెట్టేందుకు ప్రయత్నాలు

కర్నూలు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదోని మెడికల్ కళాశాల విషయంలో వైసీపీ నాయకులు ఛీప్ ట్రిక్కులు ప్లేచేస్తున్నారు. ఈ వైద్యకళాశాలను 420 బెడ్స్ బోధనాస్పత్రి వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణ పనులు మొదలు పెట్టారు. 13.31లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో టీచింగ్ హాస్పిటల్, మెడికల్ కాలేజీ, రెసిడెన్షియల్ స్టాఫ్ క్వార్టర్స్, నర్సింగ్ కాలేజీ, విద్యార్థుల వసతిగృహాలు, జూనియర్, సీనియర్ రెసిడెన్స్ హాస్టల్, నర్సింగ్ విద్యార్థుల వసతి గృహం, వర్కింగ్ స్టాఫ్ నర్స్ క్వార్టర్స్ హాస్టల్, సెంట్రల్ కిచెన్, డైనింగ్, ఎంజీపీఎస్ ప్లాంట్ రూమ్స్, లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్, బయో మెడికల్ వేస్ట్ ప్లాంట్ రూమ్స్, సెంట్రల్ డ్రగ్ స్టోర్, లాండ్రీ, మార్చురీ వంటి భవన నిర్మాణాల కోసం నాబార్డు రుణం రూ.475 కోట్లు ఇచ్చింది. అందులో కాంట్రాక్ట్ విలువ రూ.350 కోట్లతో సివిల్ పనులకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) టెండర్లు పిలిస్తే, విజయవాడకు చెందిన కేఎంవీ గ్రూప్ సంస్థ టెండర్లు దక్కించుకుంది. 30 నెలల్లో పూర్తి చేయాలని ఒప్పందం. 2021 మే 31న అప్పటి సీఎం జగన్ వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేస్తే, 18 నెలలు వరకు గంపెడు మట్టి తీయలేదు.. ఒక్క ఇటుక కూడా పెట్టలేదు. అప్పటి వైసీపీ ముఖ్య నాయకులకు కాంట్రాక్ట్ సంస్థ మధ్య వాటాల తేడాలు రావడంతో పనులు మొదలు పెట్టలేదని నాడు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఎట్టకేలకు 2022 డిసెంబరు 26న ఒప్పందం చేసుకొని పనులు మొదలు పెట్టారు.

రూ.47 కోట్లు మాత్రమే చెల్లింపు

నాడు జగన్ శంకుస్థాపన చేసిన ఏడాదిన్నర తర్వాత పనులు మొదలు పెట్టిన కాంట్రాక్ట్ సంస్థ రూ.71కోట్లు విలువైన పనులు మాత్రమే చేసింది. రూ.47కోట్లు మాత్రమే బిల్లులు చెల్లించారు. ఇంకా రూ.24కోట్లు బిల్లులు చెల్లంచాల్సి ఉండేది. అప్పటికే ఎన్నికల వాతావరణం ఏర్పడడంతో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన 2024 జూన్ 11 నాటికి ఏడాది ముందే కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఆరు నెలలకు మించి పనులు జరగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక 20శాతం కంటే తక్కువ పురోగతి ఉన్న పనులు ఆపేసింది. అందులో ఆదోని వైద్య కళాశాల కూడా ఉంది. బాలిక హాస్టల్ భవనం, కాలేజీ, అకాడమిక్ భవనాలు ఒక్కటే స్లాబులు పూర్తిచేశారు. మిగిలిన అన్నీ భవనాలు కూడా పిల్లర్లు, పునాదులతోనే ఆగిపోయాయి. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే నాటి వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. అదేదో గత ప్రభుత్వ హయాంలోనే కళాశాల భవనాలు అన్ని పూర్తిచేసినట్లు, కూటమి ప్రభుత్వమే నిర్లక్ష్యం చేస్తున్నట్లుగా నాటి తప్పిదాలను కూటమి ప్రభుత్వంపై నెట్టేందుకు వైసీపీ నాయకులు కుట్రలు చేస్తున్నారు. నాడు జగన్ శంకుస్థాన చేసిన ఏడాదిన్నర తర్వాత ఎందుకు పనులు మొదలు పెట్టారు? కూటమి ప్రభుత్వం రావడానికి ఏడాది ముందే పనులు ఎందుకు ఆపేశారు? ఈ ప్రశ్నలకు వైసీపీ నాయకుల వద్ద సమా ధానాలు లేవు.

అసంపూర్తిగా ఆదోని మెడికల్ కాలేజీ అకాడమిక్ భవనం



భూసేకరణలో భారీ అవినీతి?

ఆదోని వైద్య కళాశాల నిర్మాణం కోసం జాతీయ రహదారి-167 పక్కనే ఆరేకల్లు గ్రామ సమీపంలో ఆరేకల్లు, కె.నాగులాపురం గ్రామాలకు చెందిన రైతుల నుంచి 59.50 ఎకరాలు సేకరించారు. ఎకరం రూ.40లక్షలు భూ పరి హారం ప్రభుత్వం చెల్లించింది. జాతీయ రహదారి ఆనుకొని ఉన్న పొలాలకు భారీ డిమాండ్ ఉంటుంది. దూరంగా ఉన్న పొలాలకు డిమాండ్ కొంత తక్కువగా ఉంటుంది. అయినా కూడా 59.50ఎకరాలకు ఒకే ధర చెల్లించారు. భూ పరిహారం మొత్తం రైతులకు చేరిఉంటే తప్పులేదు. భూ సేకరణ పేరిట గత ప్రభుత్వ హయాంలో అప్పటి వైసీపీ ముఖ్య ప్రజాప్రతినిధి ఒకరు, ఆ నాయకుడికి నమ్మినబంటుగా ఉంటున్న మరో నాయకుడు, ఓ రెవెన్యూ కిందిస్థాయి అధికారి కలసి భూ సేకరణ పేరిట భారీ అవినీతి అక్రమాలకు తెర తీశారని అప్పుడే ఆరోపణలు వచ్చాయి. జీవనాధారమైన భూములు కోల్పోయిన రైతుల నుంచి ఎకరాకు రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పైగా అక్రమంగా వసూలు చేశారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. దీనిపై ఏసీబీ లేదా సీఐడీ అధికారులతో సమగ్ర విచారణ చేస్తే రూ.కోట్లు విలువైన కుంభకోణం వెలుగు చేసే అకాశం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతేకాదు.. వైద్య కళాశాల నిర్మించే ప్రదేశానికి కేవలం ఆరేడు కిలోమీటర్ల దూరంలోనే వేల ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. అక్కడ కాకుండా ఓ ముఖ్య నాయకుడికి మేలు చేసేందుకే అప్పట్లో ప్రభుత్వ భూమిని కాదని, రైతుల నుంచి భూ సేకరణ చేశారనే ఆరోపణ కూడా లేకపోలేదు.

ఆధార్ ప్రక్రియను వేగవంతం చేయాలి

జడ్పీ సీఈవో నాసరరెడ్డి



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో నాసరరెడ్డి

కర్నూలు, న్యూసిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల పరిధిలో ఆధార్ నమోదు, తదితర సేవలు వేగవంతం చేయాలని జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా పరిషత్తు సమావేశ భవనంలో యూనివర్సిల్ ఆధార్ క్లయింట్‌పై సచివాలయాల్లో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. యూఐడీఏఐకు చెందిన మాస్టర్ ట్రైనర్ వెంకరమణ ఆధార్ ప్రక్రియపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ యూనివర్సల్ అనేది ఆన్‌లైన్ ఆధునిక సాఫ్ట్‌వేర్ అన్నారు. ఇది వివిధ ఆధార్ సంబంధిత సేవలను ఒకే ప్లాట్‌ఫామ్ ద్వారా అందుబాటులోకి తీసుకు వస్తుందన్నారు. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా ఆధార్ నమోదు, నవీకరణ ప్రక్రియ వేగంగా, కచ్చితంగా జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆదాయ వనరులు సృష్టించాలి

జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి



మాట్లాడుతున్న ఎర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు, న్యూసిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఆస్తి, ఇతర పన్నులతో సొంతంగా పంచాయతీలకు ఆదాయాలను సృష్టించుకోవాలని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. విజయవాడ ఏపీఎస్ఐఆర్డీ అండ్ పీఆర్ ఉత్తర్వుల మేరకు ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవోలకు మంగళవారం డీపీఆర్సీ భవనంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో సొంత ఆదాయ వనరులైన పన్నులు, ఇతర మార్గాల ద్వారా ఆదాయం సమకూర్చుకుని గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. ఆదాయ వనరులు సమకూర్చుకోవడానికి చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. పంచాయతీల అభివృద్ధికి ఆదాయ వనరులు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో జి.భాస్కర్, ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్, టీవోటులు ఏ.జేమ్స్ కృపవరం, పి.ప్రభాకర్, అన్వర్‌బాషా, పి.జగన్నాథం, డీకే దస్తగిరి పాల్గొన్నారు.

కర్నూలులో హైకోర్టును వెంటనే ఏర్పాటు చేయాలి



నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

కర్నూలు లీగల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో రాష్ట్ర హైకోర్టును వెంటనే ఏర్పాటు చేసి సీమ వాసులకు న్యాయం చేయాలని కర్నూలు హైకోర్టు సాధన సమితి నాయకులు మంగళవారం డిమాండ్ చేశారు. ఈ మేరకు న్యాయవాదులు స్థానిక జిల్లా కోర్టు ఆవరణం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీబాగ్ ఒప్పందం మేరకు రాయలసీమలో హైకోర్టును ఏర్పాటు చేయాల్సిందేనని, కోస్తా ప్రాంతంలో రాజధానిని ఏర్పాటు చేసినందుకు సీమ వాసులకు న్యాయం చేయాలని కోరారు. ఈ ర్యాలీలో హైకోర్టు సాధన సమితి నాయకులు రామాంజనేయులు, నరసింహులు, కృష్ణమూర్తి, భగత్ తదితరులు పాల్గొన్నారు.

'స్త్రీ శక్తి' విజయవంతం : ఆర్టీసీ జోనల్ చైర్మన్



మాట్లాడుతున్న పూల నాగరాజు

కర్నూలు రూరల్ సెప్టెంబరు16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్త్రీశక్తి పథకం విజయవంతంగా అమలవుతోందని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోనల్ చెర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 వేలు బస్సులు, కడప జోన్‌పరిధిలో 3420 బస్సులను మహిళలకు కేటాయించారన్నారు. కర్నూలులో ప్రతిరోజు దాదాపు 40వేల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారని ఆయన వివరించారు. మంగళవారం కర్నూలు కొత్త బస్టాండులోని బస్‌స్టేషన్‌మేనేజర్ కార్యాలయంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, డీసీఎంహెచ్ చెర్మన్ నాగేశ్వరరావు యాదవ్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. చైర్మన్ పూల నాగరాజు మాట్లాడుతూ ఈ పథకానికి కూటమి ప్రభుత్వం దాదాపు రూ.5కోట్ల వరకు ఖర్చు పెడుతోందన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ కర్నూలును సీఎం చంద్రబాబు అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. కర్నూలు జిల్లాల్లోని ఏడు నియోజకవర్గాల్లో ప్రయాణికుల కోసం మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్మాణానికి తన నిధులు ఇస్తానన్నారు. అందుకు తగ్గ స్థలం బస్టాండ్‌లో చూపిస్తే త్వరితగతిన ఆర్వో ప్లాంట్ పనులు ప్రారంభిస్తానని ఎంపీ అధికారులకు తెలిపారు. ప్రయాణికులకు పశ్చిమ ప్రాంతంలో అధికంగా వలసలు ఉంటాయని ఆప్రాంతంలో కూడా బస్సులు తిప్పేలా చూడాలని ఎంపీ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. డీసీఎంహెచ్‌చైర్మన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో స్త్రీశక్తి పథకం సూపర్ సక్సెస్ అయిందన్నారు. అనంతరం కొత్తబస్టాండ్‌లో ప్లాట్ ఫారం వద్ద సీఎం అమలు చేసిన ఉచిత ప్రయాణంపై కొంత మంది మహిళ ప్రయాణికుల అభి ప్రాయాలను అడగడంతో చాలా బాగుందని థ్యాంక్యూ సీఎం సార్ అని మహిళలు చెప్పారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ శ్రీనివాసులు, కర్నూలు-1,2డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనను అలవర్చుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ధి

కర్నూలు లీగల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఖైదీలు సత్ప్రవర్తనను అలవర్చుకుని శిక్షా కాలాన్ని పూర్తి చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి సూచించారు. పంచలింగాలలోని జిల్లా జైలును ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కబర్ధి మాట్లాడుతూ ఖైదీలు కక్షలను విడనాడి, గతాన్ని మరిచి మంచి పౌరులుగా మారాలని కోరారు. 70 సంవత్సరాలు వయస్సు పైబడిన ఖైదీలు, అనారోగ్యంతో బాధపడే ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని, వారికి త్వరలో బెయిల్ మంజూరయ్యేలా కృషిచేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రిజన్ లీగల్ ఎయిడ్‌ల గురించి ఖైదీలకు వివరించారు. ఈ క్లినిక్‌లలో ఒక న్యాయవాది, ఒక పారా లీగల్ వలంటీర్ సభ్యులుగా ఉంటారని, ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా జైలును, మహిళా జైలును పరిశీలించారు. ఖైదీలను కోర్టు వాయిదాలకు తప్పకుండా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని జైలు అధికారులను ఆదేశించారు. ఖైదీలకు సమస్యలు ఉంటే హెల్ప్‌లైన్ 15100కు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.లీలా వెంకట శేషాద్రి, లీగల్ ఎయిడ్ న్యాయవాదులు శివరాం, సులోచన, జైలు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ధి

ముట్టడీలా

- వంద మంది కూడా హాజరుకాని వైనం
- వైసీపీ నాయకుల ఓవరాక్షన్
- మెడికల్ కళాశాలకు వైసీపీ జెండాలు



ప్రభుత్వ మెడికల్ కళాశాలకు కట్టిన వైసీపీ జెండాలు

ఆదోని రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు చేపట్టిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ ముట్టడి కార్యక్రమం తుస్సుమంది. తమ సొంత పార్టీ కార్యాలయం అనుకున్నారో ఏమో నిర్మాణంలో ఉన్న ఆదోని ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాల చుట్టూ వైసీపీ జెండాలు కట్టారు. ఈ మెడికల్ కాలేజీని వైఎస్ జగన్ కట్టించారని, తమదేనంటూ హల్‌చల్ చేశారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరేకల్లు సమీపంలో నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీని వైసీపీ నాయకులు మంగళవారం ముట్టడించారు. పట్టుమని వంద కూడా హాజరు కాలేదు. చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పీపీపీ పద్ధతిలో కాకుండా ప్రభుత్వమే మెడికల్ కళాశాలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన వైసీపీ కార్యకర్తలు జై జగన్ అంటూ నినాదాలు చేశారు. అక్కడ ఉన్న మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి కలుగ చేసుకొని ఎక్కువ అరిస్తే బీపీ వస్తుందనడంతో అక్కడున్న వైసీపీ శ్రేణులు సైలెంట్ అయిపోయారు.



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

నోటిఫికేషన్‌లో మార్పులపై ఆశలు

- నేడు దరఖాస్తులకు చివరి రోజు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): బార్ లైసెన్స్ నోటిఫికేషన్‌లో ఏమైనా మార్పులు ఉంటాయని యాజమాన్యాలు ఎదురుచూస్తున్నాయి. మంగళవారం సాయంత్రానికి ఏడు బార్లకు ఒక్క దరఖాస్తు కూడా వేసేందుకు యాజమాన్యాలు ముందుకు రాలేదు. తాజాగా అమరావతిలో రెండు రోజుల పాటు జిల్లాల కలెక్టర్లతో జరుగుతున్న సమావేశాల్లో బార్ లైసెన్స్ నోటిఫికేషన్ జారీచేసిన విషయంలో యాజమాన్యాలు ఆసక్తి చూపకపోవడంతో కలెక్టర్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. లైసెన్స్‌లో మార్పులపై ఆలోచించాలని సూచించడంతో యాజమాన్యాలు కొంత ఆసక్తితో ఎదురుచూస్తున్నాయి. ఈనెల 17న దరఖాస్తుల స్వీకరణకు చివరిరోజు కావడంతో యాజమాన్యాలు మార్పులుంటాయనే ఆశతో దరఖాస్తులు వేసేందుకు ముందుకు రాలేదు. కర్నూలు-4, ఎమ్మిగనూరు -2, గూడురు-1 బార్‌కు దరఖాస్తులు వేయలేదు. జిల్లాలో 28 బార్లకు నోటిఫికేషన్ జారీ చేయగా మొదటి విడతలో 19బార్లకు లైసెన్స్‌లు దక్కించుకున్నారు. మరో 7బార్లకు నోటిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేస్తామని ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

హరినాథుడి హస్తకళా నైపుణ్యం



- కొయ్యలతో కళాకృతుల నిర్మాణంలో దిట్ట
- ఆధునిక డిజైన్ల తయారీలో అందెవేసిన చెయ్యి
- పలువురితో ప్రశంసలు ● ఎన్నో అవార్డులు

అతను వృత్తి రీత్యా ఓ కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడు.. ప్రవత్తి హస్తకళా, చిత్ర లేఖనం.. ఆయన బొమ్మలు తయారు చేశాడంటే చాలు.. ప్రతి ఒక్కరూ చూస్తూ ఉండిపోవాల్సిందే. జీవత్వం ఉట్టిపడేలా ఉంటాయి అతడి కళాకృతుడు.. అతడే చింతలచెరువు గ్రామానికి చెందిన హస్త కళాకారుడు హరినాథ్. చిన్నతనంలోనే డ్రాయింగ్‌పై ఉన్న మక్కువతో బొమ్మలు తయారు చేసేవాడు. దీన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు అతడికి శిక్షణ ఇప్పించి మరింత రాటుతేలేలా చేశారు. హరినాథ్ కొయ్యలతో బొమ్మలు తయారుచేసి ఎందరితోనో ప్రశంసలు అందుకున్నాడు.

చాగలమర్రి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హస్తకళ, చిత్రలేఖనంలో అందేవేసిన చెయ్యి. కొయ్యలతో కళాకృతులను అందంగా తీర్చిదిద్దడంతో దిట్ట. కొయ్యలను వయ్యారిభామలు, ఆధ్యాత్మికత ఉట్టిపడే దేవతామూర్తులుగా తయారుచేస్తూ ఎందరితోనో ప్రశంసలు అందుకుంటున్నాడు హరినాథ్. నంద్యాల జిల్లాలోని చాగలమర్రి మండలం చింతలచెరువు చెందిన హరినాథ్ హస్తకళల్లో నైపుణ్యం ప్రదర్శిస్తున్నాడు.



డ్రాయింగ్ అంటే ఇష్టం..

సుబ్బయ్యఆచారి, వెంకటలక్ష్మమ్మ దంపతుల కుమారుడు హరినాథ్ కుమార్. తండ్రి కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. స్వగ్రామంలోనే పదో తరగతి వరకు చదివాడు. చదువుకునే వయసులోనే డ్రాయింగ్ అంటే ఇష్టం. చిన్నతనంలోనే హరినాథ్ బొమ్మలు సరికొత్త డిజైన్‌లు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యాడు. పదిపూర్తయ్యాక తిరుపతికి వెళ్లి డీటీఎస్ కోర్స్ చేశారు. నాలుగేళ్ల పాటు చెక్కశిల్ప విభాగంలో కోర్స్ పూర్తిచేసి అక్కడి నుంచి హైదరాబాదుకు వెళ్లి బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ కళాశాలలో చేరి మూడేళ్లు తెలుగు యూనివర్సిటీలో బీఎఫ్ఏ పూర్తి చేశారు.





అవార్డు అందుకున్న హస్త కళాకారుడు

బొమ్మల తయారీలో..

చదువుకునేటప్పుడు పక్షులు అంతరించిపోతున్నాయి అనే అంశంతో బొమ్మలు తయారు చేయమని అప్పటి ప్రభుత్వం సూచించింది. బొద్దింక బొమ్మను 15అడుగుల్లో స్క్రాబ్‌తో తయారు చేశారు. మునీశ్వరుడి బొమ్మను తల వరకు చెక్కతో తయారు చేశాను. బొమ్మల తయారీపై వరంగల్‌లో జరిగిన యూత్ ఫెస్టివల్‌లో పాల్గొని ద్వితీయస్థానం సాధించారు.

హర్యానాలో జరిగిన ఫెస్టివల్‌లో ప్రతిభ కనబరిచి అవార్డు అందుకున్న. విజయవాడలోని హరిత రిసర్స్‌లో అమ్మవారి విగ్రహం హైదరాబాదులో దుర్గం చెరువులో వినాయకుడి విగ్రహం తయారు చేసినందుకు యూనివర్సిటీ ప్రొఫెసర్లతో అవార్డు అందుకున్న. వినాయకుడు, లక్ష్మీదేవి, సాయిబాబా, పలు దేవతా మూర్తుల తయారీలో సిద్ధహస్తులుగా పేరుగాంచారు. 2013లో టీటీసీ చేసి 2014లో సమగ్ర శిక్ష అబియాన్‌లో పార్ట్‌టైమ్ టీచర్‌గా ఉద్యోగంలో చేరారు. చిన్నవంగలి పాఠశాలలో విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు చిత్రలేఖన శిక్షణ ఇస్తున్నారు. చిత్రలేఖనం. హస్తకళలతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ఈ కళ నిరాంతరయంగా చేతిపడితో కూడుకున్నది. మంచి బొమ్మలు తయారుచేయాలంటే 4, 5రోజులు పడుతుందని, ప్రభుత్వం ఆదుకుంటే మరింత అబివృద్ధి చెందుతుందని హరినాథ్ తెలిపారు.

అక్రమ లేఅవుట్లపై ఉక్కుపాదం

- ఎల్‌ఆర్ఎస్ చేయించుకోపోతే క్రిమినల్ చర్యలు తప్పవు
- మున్సిపాల్టీలకు ఆదాయం పెంచే విధంగా అధికారుల చర్యలు ఉండాలి
- ఎల్‌ఆర్ఎస్ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించండి
- 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

నందికొట్కూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో వేసిన అక్రమ లేఅవుట్లను ఎల్‌ఆర్ఎస్ విధానం ద్వారా క్రమబద్ధీకరణ చేసుకోవాలని, లేని పక్షంలో క్రిమినల్ చర్యలు తప్పవని 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఎల్‌ఆర్ఎస్ నూతన విధానంపై ప్రజల్లోనూ, రియల్ ఎస్టేట్ వ్యాపారుల్లోనూ అవగాహన పెంచేందుకు మున్సిపల్, పంచాయతీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ మాట్లాడుతూ ఎల్ఎస్ఆర్ విధానం అమలులోకి వచ్చి నెల రోజులు అవుతోందని, మరో రెండు నెలలు మాత్రమే గడువు ఉందన్నారు. ఎల్‌ఆర్ఎస్ విధానంపై అధికారులు విరివిగా అవగాహన కల్పించాలన్నారు. గత వైసీపీ హయంలో అక్రమంగా 23 లేఅవుట్లు వెలసి లక్షలాది రూపాయలు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారన్నారు. ఈ ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఎల్‌ఆర్ఎస్ గడవు దాటాక అక్రమ లేఅవుట్లపై ఉక్కుపాదం మోపుతామన్నారు. రెండు మూడు సార్లు నోటీసులు ఇచ్చి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఆ తర్వాత కూడా స్పందించకపోతే ఇళ్లు కట్టినా, స్థలాల్లో రాళ్లు పాతినా పడగొడతామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడితే మాత్రం సహించేది లేదన్నారు. వ్యాపారులు, ప్లాట్లు కొన్న వినియోగదారులు దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బేబి, కుడా ప్లానింగ్ ఆఫీసర్ విజయభాస్కర్, ఏసీపీ హాయబ్‌మొహిద్దీన్, టీపీవో రంగస్వామి, నందికొట్కూరు, పగిడ్యాల, మిడ్తూరు, పాములపాడు, జూపాడుబంగ్లా, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల తనిఖీ



వక్ఫ్ భూములను పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం పంచలింగాల గ్రామంలో గల వక్ఫ్ భూములు సర్వే నెంబర్.301, 319, 320, 325, 324, 326 జిల్లా అధికారులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధికారి పర్వీన్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ ముక్తార్ బాషా ఉన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

- మార్క్‌ఫెడ్ ద్వారా 6,588 క్వింటాళ్ల ఉల్లి కొనుగోళ్లు
- జాయింట్ కలెక్టర్ నవ్య



వేలం పాటను పర్యవేక్షిస్తున్న జేసీ నవ్య

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు తీసుకువచ్చిన ఉల్లిని మార్క్‌ఫెడ్ సంస్థ, వ్యాపారుల ద్వారా కొనుగోలు చేయిస్తున్నామని, ఆందోళన చెందొద్దు అని జేసీ నవ్య అన్నారు. సోమవారం 10,022 క్వింటాళ్ల ఉల్లిగడ్డల్లో 2వేల క్వింటాళ్లను రాష్ట్రంలోని వివిధ రైతుబజార్లకు పంపారు. మిగిలిన 8,022 క్వింటాళ్ల ఉల్లిగడ్డలకు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో 6,588 క్వింటాళ్లను మార్క్‌ఫెడ్ సంస్థ కొనుగోలు చేసింది. మిగిలిన ఉల్లిని వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈవేలాన్ని జేసీ డా.బి.నవ్య పర్యవేక్షించారు. ఇప్పటికే కర్నూలు మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ సంస్థతో పాటు వ్యాపారులు కొనుగోలు చేసిన ఉల్లిని పెద్దఎత్తున ఉండటంతో బయటకు తరలించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈనెల 18, 19 తేదీల్లో కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి విక్రయాలు నిర్వహించడం లేదని జేసీ తెలిపారు. కార్యక్ర మంలో సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రెటరీలు సుందర్‌రాజు, వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, నగేష్, శివన్న పాల్గొన్నారు.

అతివలకు ఆరోగ్య భరోసా

- నేటి నుంచి 'స్వస్తనారీ సశక్త్ పరివార్ అభియాన్'



సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతికళ

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ (ఆరోగ్యవంతమైన మహిళ, శక్తివంతమైన కుటుంబం) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ తెలిపారు. మంగళవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో స్టేట్ నోడల్ ఆఫీసర్లు డిప్యూటీ డైరెక్టర్ రామనాథం అయుష్మాన్ భారత్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.నరేష్ ఆధ్వర్యంలో డీఎం హెచ్‌వో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక వైద్యశిబిరాల్లో మహిళలకు గుండె జబ్బులు, మధుమేహం, నోటి, గర్భాశయ క్యాన్సర్లకు పరీక్షలు నిర్వహించి తగిన చికిత్సలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డా.జఫ్రుల్లా, జిల్లా టీబీ ఆఫీసర్ డా.ఎల్.భాస్కర్, డీఐవో డా.నాగేంద్ర ప్రసాద్, ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డా.మహేశ్వర ప్రసాద్, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ డా.భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగో విడత ప్రవేశానికి దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డీఎల్‌టీసీ, ఐటీఐ కర్నూలులో మిగిలిన ఖాళీలను భర్తీ చేసేందుకు నాలుగో విడత అడ్మిషన్ల కోసం ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఎల్‌టీసీ ఐటీఐ శిక్షణా సహాయ సంచాలకులు ఎఫ్ఏసీ ఆర్.కృష్ణమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు చేసుకునే విద్యార్థులు ఈ నెల 27వ తేదీ చివరి గడువు అన్నారు. ఐటీఐ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకెళ్లి వెరిఫికేషన్‌ను చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ ఈ నెల 9న ఉదయం 10.30 గంటలకు డీఎల్‌టీసీ, ఐటీఐ కర్నూలులో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



సదస్సులో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

- జిల్లా జీడీపీ వృద్ధి సాధించాలి
- ప్రజా సమస్యలపై పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలి
- కలెక్టర్, ఎస్పీలకు సీఎం చంద్రబాబు సూచనలు
- హాజరైన మంత్రి టీజీ భరత్, కలెక్టర్ సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాకు పరిశ్రమలు భారీగా వస్తున్నాయి. ఆ పరిశ్రమలు సకాలంలో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటేనే యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగు పడుతాయని, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలు ఇచ్చారు. అమరావతిలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం చంద్రబాబు రెండు రోజులు జిల్లాల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లాకు చెందిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్, కలెక్టర్ డాక్టర్ అట్టాడ సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ హాజరు అయ్యారు. మంగళవారం జిల్లాలో కీలక రంగాల్లో పురోగతి, శాంతిభద్రతలు, నేరాలు అదుపులో పోలీస్ యంత్రాంగం చేస్తున్న కృషి తదితర అంశాలపై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ ఎ.సిరి బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజే సీఎం సమావేశానికి హాజరయ్యారు. ముఖ్యంగా జిల్లాలో వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ, హంద్రీ-నీవా ప్రాజెక్టు పత్తికొండ రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువ అసంపూర్తి పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ డాక్టర్ సిరికి సీఎం సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే సమస్యలు, ముఖ్యంగా భూ సమస్యలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని, రైతులు ఆఫీసుల చుట్టూ తిరగకుండా చూడాలని తెలిపారు. ఓర్వకల్లు కేంద్రంగా పరిశ్రమలు బాగా వస్తున్నాయని, వారికి అవసరమైన మౌలిక వసతులు, ప్రభుత్వ అనుమతుల జారీలో జిల్లా యంత్రాంగం పంపాల్సిన ఫైళ్లు తక్షణమే క్లియర్ చేయాలని, ఏ దశలో కూడా పెండింగులో ఉంచవద్దని, పరిశ్రమలు సకాలంలో గ్రౌండ్ అయితే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగు పడుతాయని సీఎం చంద్రబాబు సూచించారు. అలాగే.. మహిళలపై జరుగుతున్న దాడులు, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని నియంత్రించాలని, మద్యం బెల్ట్ షాపులు నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీకి సూచించినట్లు తెలిసింది. జిల్లా సమగ్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు విజన్ ఇచ్చారని, ఆమేకు ముందుకు వెళ్లి జిల్లాను ప్రగతి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని కలెక్టర్ సిరి ఆంధ్రజ్యోతి వివరించారు. ముఖ్యంగా ప్రాజెక్టులు, పరిశ్రమలు నిర్మాణానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించినట్లు వివరించారు.

అమెరికా పర్యటన విజయవంతం

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వినూష రెడ్డి



కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయంగా వివిధ రంగాల్లో ఉన్న యువ నాయకులతో అమెరికా మధ్య శాశ్వత సంబంధాలు పెంపొందించే లక్ష్యంతో అమెరికాలో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ విజిటల్ లీడర్‌షిప్ ప్రోగ్రాం (ఐవీఎల్‌పీ) పర్యటన విజయవంతంగా ముగిసిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ బి.వినూష రెడ్డి చెప్పారు. స్వదేశానికి తిరిగి వచ్చిన ఆమె మంగళవారం నగరంలోని నెహ్రూనగర్‌లో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించి అమెరికా పర్యటన వివరాలు వెల్లడించారు. గతంలో ఐవీఎల్‌పీ కార్యక్రమం కింద ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ ప్రధానులు అటల్ బీహారీ వాజ్‌పేయ్, ఇందిరాగాంధీ మైనార్టీ దేశాయ్ అమెరికాకు వెళ్లారని, తాను కూడా మూడున్నర వారాలు అమెరికాలో పర్యటించి వచ్చానని చెప్పారు. జాతీయ అధ్యక్షుడు నడ్డాను కలిసి ఐవీఎల్‌పీ నివేదికను సమర్పించానని తెలిపారు. అమెరికాలో 22 దేశాల ప్రతినిధులను కలిసి ఐవీఎల్‌పీ ప్రోగ్రాంలో పాల్గొన్నట్లు తెలిపారు. అమెరికాలోని వాషింగ్‌టన్ డీసీ, మాంచెస్టర్, బోస్టన్, కొలంబియా, సాల్ట్‌లేక్ సిటీలను సందర్శించి అక్కడ చట్టసభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులు, ఎన్జీవోలతో చర్చలు జరిపినట్లు తెలిపారు. మహిళా రాజకీయ భాగస్వామ్యం విషయంలో అమెరికా ఇంకా వెనుకబడి ఉందని, అక్కడ నల్లజాతి మహిళలకు 1965లో ఓటుహక్కు వచ్చిందని, ఇప్పటి వరకు అమెరికలో ఒక మహిళా అధ్యక్షురాలు లేరని గుర్తు చేశారు. దక్షిణాఫ్రికా దేశంలో మహిళలకు 40 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయన్నారు. జపాన్ మేయర్, దక్షిణాఫ్రియా మేయర్, యూరప్ నుంచి ఎంపీ, పోలెండ్ నుంచి ప్రతినిధులను కలిసినట్లు తెలిపారు. అమెరికాలోని ఐదు రాష్ట్రాల్లో పర్యటించినప్పుడు హోంలెస్ పీపుల్స్ బిచ్చగాళ్లు ఉన్నారని, అక్కడ నిరాశ్రయులకు డ్రగ్స్ వంటి సమస్యలు ఉన్నాయన్నారు. అమెరికాలో గర్భస్రావం, గన్ కల్చర్‌పై బహిరంగ విభజనలో ఉందన్నారు. 2029లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వాలను మహిళా సాధికారత కోసం తీసుకువచ్చిన 33 శాతం రిజర్వేషన్ బిల్లు రాజకీయాల్లో గేమ్ చేంజర్ అవుతుందన్నారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.3.5 కోట్లు

మంత్రాలయం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం రూ.3,50,17,143 నగదు వచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేశ్ జోషి, శ్రీపతి ఆచార్, సురేష్ కోణాపూర్ తెలిపారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లోని 27 రోజుల హుండీ ఆదాయాన్ని మఠం గురురాజాంగణ భవనంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం లెక్కించారు. నగదుతో పాటు 950 గ్రాముల వెండి, 138 గ్రాములు బంగారు, వివిధ దేశాల డాలర్లు వచ్చినట్లు మఠం అధికారులు చెప్పారు. వచ్చిన నగదును శ్రీమఠం బ్యాంకు ఖాతాకు జమ చేసినట్లు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో జేపీస్వామి, కృష్ణమూర్తి, దేశాయ్ నరసింహమూర్తి, గిరిధర్, సుజ్ఞానేంద్ర, శ్రీపాదాచార్ పాల్గొన్నారు.



మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

ఉద్యోగం వచ్చిందని సంబరపడ్డాం.. ఇప్పుడు లేదంటారా?

- మెరిట్ జాబితాలో పేరుంది.. సర్టిఫికెట్లు పరిశీలించారు
- ఉద్యోగ జాబితాలో పేరు లేక డీఎస్సీ అభ్యర్థుల ఆందోళన
- డీఈవోను నిలదీసిన అభ్యర్థులు



డీఈవో శామ్యూల్ పాల్ వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

కర్నూలు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): 'సార్..! మెగా డీఎస్సీ-2025 మెరిట్ జాబితాలో పేరుంది.. సర్టిఫికేట్లు కూడా పరిశీలించి అన్ని సక్రమంగా ఉన్నాయని అన్నారు. మాకు ఉపాధ్యాయ ఉద్యోగం వచ్చిందని సంబర పడ్డాం.. కష్టాలు తీరాయని ఆనందించాం. ఉద్యోగ నియామక జాబితాలో మా పేరు లేదు.. ఎందుకు అన్యాయం చేశారు. మా గోడు ఎవరితో చెప్పుకోవాలి..!' అంటూ డీఎస్సీ-2025 అభ్యర్థులు కన్నీటి పర్యంతమయ్యారు. డీఈవో శామ్యూల్‌పాల్‌తో వాగ్వాదానికి దిగారు. మంగళవారం డీఈవో కార్యాలయం ప్రాంగణం చివరి క్షణంలో ఉద్యోగం చేజారిన అభ్యర్థుల కన్నీళ్లతో నిండిపోయింది. జిల్లాలో వివిధ ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 2,674 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ-2025 నోటిఫికేషన్ జారీ చేశారు. దాదాపు 52 వేల మందికి పైగా నిరుద్యోగులు పరీక్షలు రాశారు. ఇటివలే మెరిట్ జాబితా విడుదల చేశారు. మెరిట్ ఆధారంగా ఒక ఉద్యోగానికి ఒకరినే (1:1 నిష్పత్తిలో) సర్టిఫికెట్లు పరిశీలనకు పిలిచారు. మంగళవారం ఉద్యోగ నియామక జాబితాను విడుదల చేశారు. సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన చాలా మంది డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగం రాలేదు. దీంతో తమకెందుకు అన్యాయం చేశారు..? అంటూ డీఈవో కార్యాలయానికి చేరుకొని ఏకరువు పెట్టారు. డీఈవో శామ్యూల్‌పాల్‌తో వాగ్వాదానికి దిగారు. అయితే.. వారికి ఎందుకు ఉద్యోగం రాలేదో వారి సందేహాలను నివృత్తి చేసి పంపించారు. జిల్లాలో వివిధ కారణాలు వల్ల అర్హత కలిగిన అభ్యర్థులు లేని 88 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంచారు. తనకు డీఎస్సీ పరీక్షల్లో 47.93 మార్కులు వచ్చాయని, ఎస్టీ కోటాలో 110 ర్యాంకు వచ్చిందని, అయితే తనకంటే తక్కువ మార్కులు, ఎక్కువ ర్యాంక్ వచ్చిన వారికి ఉద్యోగం ఇచ్చి నాకు అన్యాయం చేశారని కౌతాళం మండలం హాల్వికి చెందిన అనిత ఏకరువు పెట్టారు. బీసీ-డీ కోటాలో 93 ఉపాధ్యాయ పోస్టులు చూపారని, ఇప్పుడేమో 92 పోస్టులే భర్తీ చేశారని కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన బంగారు మౌనిక అన్నారు. తనకు 73.37 మార్కులు వచ్చాయని, ఒక పోస్టు తగ్గించడం వల్ల 73.43 మార్కులు వచ్చిన అభ్యర్థితో ఆగిపోయిందని చెప్పారు. సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచి ఇప్పుడు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన ఉద్యోగం చేజారిందని వందలాది మంది డీఎస్సీ అభ్యర్థులు కన్నీరుమున్నీరై విలపించారు. ఈ విషయం డీఈవో శామ్యూల్‌పాల్ దృష్టికి ఆంధ్రజ్యోతి తీసుకెళ్లగా రిజర్వేషన్లు వల్ల కొందరు, సరిహద్దు గ్రామాల అభ్యర్థులు కర్ణాటకలో చదివిన వాళ్లు కొందరు అర్హత కోల్పోయారని, వారికున్న సందేహాలను నివృత్తి చేశామని చెప్పారు.

ఉన్నత విద్యామండలిలో ఇద్దరు వైస్ చైర్మన్ల నియామకం

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యామండలిలో రెండు వైస్ చైర్మన్ పోస్టులను భర్తీ చేస్తూ ఉన్నత విద్యాశాఖ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. వైస్ చైర్మన్-1గా శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్.విజయభాస్కరరావును, వైస్ చైర్‌పర్సన్-2గా నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ రత్నశీల మణిని నియమించింది. వీరి పదవీ కాలం మూడేళ్లు. గత ప్రభుత్వం నియమించిన ఇద్దరు వైస్ చైర్మన్లలో ఒకరి పదవీకాలం ఇటీవల ముగియగా, మరొకరు రాజీనామా చేశారు. ఆయా స్థానాలను కూటమి ప్రభుత్వం ఇప్పుడు భర్తీ చేసింది.

ప్రజల్లో వ్యతిరేకత తెచ్చేందుకే చెడు ప్రచారం

- మంత్రి భరత్‌పై ఆరోపణల్లో వాస్తవం లేదు
- ఎంపీ బస్తిపాటి నాగరాజు



కర్నూలు అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత తెచ్చేందుకు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నగరంలోని ఏబీసీ ప్రభుత్వ క్వార్టర్స్‌లో ఉన్న వారిలో కొంత మందిని మంత్రి టీజీ భరత్ ఖాళీ చేయిస్తున్నారని దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. మంత్రిపై తప్పుడు ప్రచారం చేయడం సరి కాదన్నారు. కొన్ని సంవత్సరాల నుంచి చాలామంది అనధికారికంగా నివసిస్తున్నారని, ఇళ్లు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. దాదాపు 900 ఎకరాలకు పైగా క్వార్టర్స్ ఉన్నాయని, ఆ స్థలాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా బాలల సంరక్షణ అధికారి శారద
- విద్యార్థినులకు 'గుడ్‌టచ్ - బ్యాడ్‌టచ్'పై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి శారద

కర్నూలు కల్చరల్/హాస్పిటల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాలికలు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి శారద అన్నారు. మంగళవారం ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ బీసీ వసతి గృహంలో 7, 8, 9వ తరగతులు చదువుతున్న విద్యార్థినులకు 'గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్' అంశంపై అవగాహన కల్పించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ సెల్‌ఫోన్లతో జాగ్రత్తగా ఉండేలా తల్లిదండ్రులు పిల్లలకు సూచనలు ఇవ్వాలన్నారు. లీగల్ సర్వీసెస్ యూనిట్ సభ్యుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లలు లైంగిక వేధింపులకు గురైనప్పుడు వెంటనే 1098నెంబరుకు ఫోన్ చేయాలన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగాధికారి, న్యాయవాది శ్రీలక్ష్మి మాట్లాడుతూ విద్యతో పాటూ నైతిక విలువలు, సమాజంపై అవగాహనను ఉపాధ్యాయులు కల్పించాలన్నారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారి శైలజ మాట్లాడుతూ విద్యార్థినులు ప్రయాణాలు చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అనుమానాస్పద మృతి

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకున్నట్లు ఎస్ఐ రామిరెడ్డి తెలిపారు. వివరాలు.. ఉయ్యాలవాడకు చెందిన సుశీలమ్మ(65) రెండు రోజులుగా తన ఇంట్లో నుంచి బయలకు రాలేదు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడికెళ్లి చూడగా ఆమె మృతి చెంది ఉంది. మృతురాలి కొడుకు వెంకటసుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్‌పీఎఫ్ ఎస్ఐ..



లక్ష్మణ్ నాయక్ (ఫైల్)

డోన్ టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ ఎస్ఐ లక్ష్మణ్ నాయక్ (52) మృతి చెందారు. పట్టణంలోని ప్లాట్‌ఫారం-2లో మంగళవారం డీఆర్‌ఎం కార్యక్రమాన్ని ముగించుకుని ఆర్‌పీఎఫ్ కార్యాలయానికి ఫుట్‌వే ద్వారా ప్లాట్‌ఫారంపై వెళ్తుండగా స్పృహతప్పి కిందపడ్డారు. తోటి సిబ్బంది రైల్వే హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అయితే చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు.

వ్యక్తికి ఏడేళ్ల జైలు శిక్ష



శిక్ష పడిన ముద్దాయి కృష్ణయ్యతో పోలీసులు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భార్య ఆత్మహత్య కేసులో భర్తకు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ నంద్యాల ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి తంగమణి తీర్పు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని చింతలాయపల్లె గ్రామానికి చెందిన నంద్యాల గోపాల్ కూతురు రాజేశ్వరి. ఆమెను అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలం చాగల్లు కి చెందిన కనకం కృష్ణయ్యకు ఇచ్చి 2006 వివాహం చేశారు. సుమారు 12ఏళ్ల పాటు వారి కాపురం సాఫీగా సాగింది. అనంతరం వివాదాలు చోటుచేసుకున్నాయి. నిత్యం అదనపు కట్నం తేవాలంటూ కృష్ణయ్య, కుటుంబ సభ్యులు రాజేశ్వరిని వేధించేవారు. ఇది భరించలేక పుట్టింటికి చేరుకుంది. 4 మార్చి 2022న విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడగా ఆస్పత్రికి తరలించారు. అదే రోజు రాత్రి చికిత్సపొందుతూ మృతి చెందింది. తండ్రి గోపాల్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ హరినాథరెడ్డి కేసు నమోదు చేశారు. విచారణలు, వాదోపవాదాల అనంతరం మంగళ వారం నిందితుడు కృష్ణయ్యకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.4వేలు జరిమానా విధిస్తూ నంద్యాల కోర్టు తీర్పునిచ్చింది. నిందితుడిని జైలుకు తరలించారు.

అప్పుల బాధతో అన్నదాత బలవన్మరణం



దిలీప్ (ఫైల్)

సి.బెళగల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈఘటన మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ పరమేష్‌నాయక్ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన రైతు దిలీప్(53) తనకున్న ఎకరా పొలంతో పాటు మరో ఐదెకరాలు కౌలు తీసుకున్నాడు. ఐదేళ్ల నుంచి పత్తి, ఉల్లి, మిరప, వేరుశనగ, కంది, ఆముదం వంటి పంటలు పండించాడు. తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నాడు. పంటలకు చేసిన అప్పులు రూ.10 లక్షలు పెరిగి వడ్డీలు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. పొలానికి తెచ్చిన పురుగుమందును మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాగాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు హుటాహుటిన కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నెరవాటి ఆస్పత్రికి షోకాజ్ నోటీస్

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెరవాటి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఈ నెల 13న బాలింత హబీబా మృతిచెందింది. ఈ సంఘటనపై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.ఆర్. వెంకటరమణ మంగళవారం ఆస్పత్రికి షోకాజ్ నోటీస్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సంఘటనపై ముగ్గురిని విచారణ కమిటీ వేశామన్నారు. డీఐవో సుదర్శన్‌బాబు, డా.ప్రసన్నకుమారి, డెమో ఇన్‌చార్జి రవీంద్రనాయక్‌లను విచారణ కమిటీ సభ్యులుగా ఏర్పాటు చేసి నివేదికను అందజేయాలని ఆదేశించారు. ఈ సంఘటనపై నివేదిక అందిన తర్వాత ఎలాంటి చర్యలు తీసుకునేది ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.

ఉల్లి రైతుకు.. కన్నీటి కష్టాలు!

- మార్కెట్లో గుట్టలుగా నిల్వలు, రోడ్డుపై వాహనాల బారులు
- 'ఉచిత' ప్రచారంతో ఎత్తుకుపోయిన జనం



బారులుతీరిన ఉల్లిగడ్డల వాహనాలు



కుళ్లిపోయిన ఉల్లిని డంపింగ్ యార్డుకు తరలిస్తూ..

కర్నూలు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతును కష్టాలు చుట్టుముట్టాయి. కాయకష్టం చేసి, చేతిలో ఉన్నదంతా పెట్టుబడిగా పెట్టి.. పండించిన పంటను ఏం చేసుకోవాలో తెలియని దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. మార్కెట్లో చూస్తే ఉల్లి బస్తాలు గుట్టలుగా పడి ఉన్నాయి. రోడ్డుపై ఇంకా ఉల్లి లోడులతో వాహనాలు వస్తూనే ఉన్నాయి. మార్కెట్లో కుళ్లిపోయిన ఉల్లిని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ... ఇదంతా ఒక ఎత్తయితే.. ఉల్లి గడ్డలను ఉచితంగా ఇచ్చేస్తున్నారనే ప్రచారం ఎలా జరిగిందో ఏమో.. స్థానిక జనం ఆటోలు, బైక్‌లపై వచ్చి మార్కెట్లో ఉన్న బస్తాలను ఎత్తుకుపోయారు. మన రాష్ట్రంలోని రాయలసీమ జిల్లాలే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని జోగులాంబ గద్వాల జిల్లా, కర్నాటకలోని రాయచూరు జిల్లాల నుంచి కూడా రైతులు పండించిన ఉల్లి దిగుబడులు అమ్మకానికి కర్నూలు మార్కెట్‌కు వస్తున్నాయి. ఒక్క కర్నూలు జిల్లా నుంచే ఈ సీజన్‌లో 15.50 లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని అధికారుల అంచనా. ఇది కాకుండా నంద్యాల, అనంతపురం, కడప తదితర జిల్లాల నుంచి కూడా రైతులు అమ్మకానికి దిగుబడులు భారీగా తీసుకొస్తున్నారు. గతేడాది క్వింటా రూ.5 వేల వరకు ధర పలికితే, ఈ ఏడాది క్వింటా రూ.350 నుంచి రూ.500లకు కూడా కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడంతో కొందరు రైతులు పొలాల్లోనే పంటను వదిలేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం క్వింటాకు రూ.1,200 మద్దతు ధర ప్రకటించి ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేయడం రైతులకు ఊరట ఇచ్చింది. ఏపీ మార్క్‌ఫెడ్ 60,057 క్వింటాళ్లు కొనుగోలు చేసింది. అందులో 3,423 టన్నులు మాత్రమే రాష్ట్రంలోని రైతు బజార్లు, సంక్షేమ హాస్టళ్లకు సరఫరా చేయగా, మిగిలిన 2,631 టన్నుల పంటను మార్కెట్‌లో నిల్వ చేశారు. వ్యాపారులు కొనుగోలు చేసిన 6,202 టన్నుల్లో సగం మార్కెట్ యార్డులోనే ఉండిపోయింది. యార్డులో ఉన్న ఉల్లి గడ్డలు కుళ్లిపోవడంతో దాదాపు వంద క్వింటాళ్లకుపైగా డంపింగ్ యార్డుకు తరలించారు. ఏ ప్లాట్‌ఫారంపై చూసినా ఉల్లి బస్తాలు గుట్టలు గుట్టలుగా పేరుకుపోయాయి. మరోవైపు రైతులు భారీ ఎత్తున ఉల్లి పంటను మార్కెట్‌కు తెస్తున్నారు. మార్కెట్ అంతా నిండిపోవడంతో ఎక్కడ నిల్వ చేయాలో తెలియని పరిస్థితి ఉంది. మంగళవారం రైతులు భారీ ఎత్తున ఉల్లి దిగుబడులు అమ్మకానికి మార్కెట్‌కు తీసుకొచ్చారు. కాగా, ఉల్లిగడ్డలు ఉచితంగా ఇస్తారని పరిసర కాలనీవాసులకు ఎవరు సమాచారమిచ్చారో తెలియదు. ఆటోలు, బైకులపై వచ్చి వ్యాపారులు, రైతులు మార్కెట్‌లో ఉంచిన ఉల్లి బస్తాలను ఇష్టారాజ్యంగా తీసుకెళ్లారు. ఆటోలు, బైకులపై వచ్చి ఉల్లి బస్తాలు ఎత్తుకెళ్లారు. ఈ పరిస్థితిని చూసి ఉల్లి రైతులు కన్నీరు పెట్టుకున్నారు. జేసీ బి.నవ్య మార్కెట్‌ను తనిఖీ చేసి, పోలీసులను రప్పించడంతో ఉల్లి బస్తాలు తీసుకువెళ్తున్న వారిని అడ్డుకున్నారు. కాగా, ఇంతవరకు కొనుగోలు చేసిన ఉల్లికిగాను రైతులకు ఏపీ మార్క్‌ఫెడ్ రూ.7.26 కోట్లు ఇవ్వాల్సి ఉంటే రూ.1.54 కోట్లు మాత్రమే చెల్లించింది. మిగిలిన రూ.5.72 కోట్లతోపాటు వ్యాపారులు కొనుగోలు చేసిన ధరపై వ్యత్యాసం 6,202 టన్నులకు రూ.5.22 కోట్లు కలిపి రూ.10.94 కోట్లు ఉల్లి రైతులకు చెల్లించాల్సి ఉంది. తక్షణమే చెల్లించాలని అన్నదాతలు కోరుతున్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- పోలీసుల అదుపులో 16 మంది.. పరారీలో 9 మంది
- రూ.1.49 కోట్ల విలువైన పందులు, మేకల పట్టివేత
- మారణాయుధాలు, మూడు వాహనాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హేమలత, పోలీసులు

ఆదోని, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పశువుల దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను ఆదోని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఆదోని డీఎస్పీ హేమలత ఆధ్వర్యంలో సీఐలు శ్రీరామ్, రాజశేఖర్‌రెడ్డి బృందంగా ఏర్పడి ఆదోని శివారులో 16 మంది ముఠా సభ్యులను అరెస్టు చేశారు. మరో తొమ్మిది మంది పరారీలో ఉన్నారు. అరెస్టు అయిన వారి నుంచి 542 పశువులు, పందులు, మేకలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1,49,33,000గా అంచనా వేశారు. రెండు ట్రాలీ వాహనాలు, కారు, ఇనుప రాడ్లు, కత్తులు, రాళ్లు, సీసాలు, కారం పొడి, ఖాళీ కూల్ డ్రింక్స్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. రాత్రిపూట పశువులను వాహనాల్లో తరలించే వీరు అడ్డొచ్చిన వారిపై విచక్షణారహితంగా దాడులు చేసేవారని పోలీసులు తెలిపారు. రెండు వారాల క్రితం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, ఆదోనిలో పందుల యజమానులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు పోలీసులు గుర్తించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్నాటక, తెలంగాణ రాష్ట్రంలోనూ వీరి నేరాలు వెలుగులోకి వచ్చాయి. జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లోనూ పశువుల దొంగతనాలతో పాటు రాబరీ, డెకాయిట్లకు పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. ఇప్పటివరకు వీరిపై 40 కేసులు నమోదు అయ్యాయని చెప్పారు.

25 మందితో గ్యాంగ్ ఏర్పాటు

కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వీరు పశువుల కదలికల సమాచారాన్ని అందించేందుకు ప్రత్యేక ఇన్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకున్నారు. 25 మంది సభ్యులతో గ్యాంగ్‌గా ఏర్పడ్డారు. పశువులను దొంగతనాలు చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు.

అరెస్టయిన వారు వీరే..

ఎరుకల ముత్తన్న, భజంత్రీ కృష్ణ, సిద్ధు, మల్లికార్జున, చంద్ర, పూసలప్ప, రంగన్న, ఎరుకలి నాగరాజు, హనుమంతు, అర్జున్, ఎరుకలి మహేశ్, లంబాడి శంకర్, వాల్మీకి వెంకటేశ్, ఆంజనేయులు, ఎరుకలి సురేష్, రవిచంద్రను పోలీసులు అరెస్టు చేశారు. మరో 9 మంది అక్కడి నుంచి పరారయ్యారని పోలీసులు తెలిపారు. 25 మందిపై కేసు నమోదు చేశామని, పరారీలో ఉన్న వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని డీఎస్పీ హేమలత తెలిపారు.

ఎరువుల దుకాణాలపై అధికారుల దాడి



రికార్డును పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారి విశ్వనాథ్

రుద్రవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు గ్రామంలో ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు దాడులు నిర్వహించారు. 14.335 టన్నుల ఎరువు సీజ్ చేసినట్లు ఉమ్మడి కర్నూలు జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి విశ్వనాథ్ తెలిపారు. రైతుల ఫిర్యాదు మేరకు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. లక్ష్మామృత ఏజన్సీస్, ఝాన్సీ ఏజన్సీస్, లక్ష్మీవెంకటేశ్వర ఫర్టిలైజర్స్ అనే మూడు షాపులపై దాడులు జరిపారు. లక్ష్మి అమృత ఏజన్సీలో యూరియా 1.39 టన్నులు డీఏపీ 2.60 టన్నులు, ఝాన్సీ ఏజన్సీలో డీఏపీ 3.250 టన్నులు, లక్ష్మి వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్‌లో 2.7టన్నులు యూరియా, 4.30 టన్నులు డీఏపీ సీజ్ చేశామన్నారు. ఈ మూడు షాపులపై 6ఎ కింద కేసు నమోదు చేసి, మొత్తం 14.335 టన్నులు ఎరువులు సీజ్ చేయగా, వాటిఖరీదు రూ.2,98,834.50గా నివేదికలు ఉన్నతాధికారులకు పంపించినటు తెలిపారు. ఏవో సుమతి, ఏఈవోలు రాజు, ఫైహిమాతబుస్సం పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వాహనాన్ని సీజ్ చేశామని ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ తెలిపారు. మంగళవారం సాయంత్రం పంచలింగాల చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో బొలేరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా శ్రీనివాసులుగౌడు, శ్రీకాంత్ వద్ద తనిఖీ చేయగా 440 గ్రాముల గంజాయి లభించడంతో అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశామన్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ దుర్గా నవీన్‌బాబు, సిబ్బంది రంగయ్య, చంద్రపాల్, రామలింగయ్య, సుదర్శన్ రాజు పాల్గొన్నారు.

ఐరన్‌బండలో పోలీసుల సోదాలు

- ఆరోపణలు ఎదుర్కొంటున్న 30 మంది గృహాల తనిఖీ
- గ్రామంలో అనుమతి పత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

గోనెగండ్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐరన్‌బండ గ్రామంలో వారం రోజుల క్రితం ఇరువర్గాల మధ్య దాడులు ప్రతి దాడులు నిర్వహించారు. దీంతో గ్రామానికి చెందిన గుర్తు చెప్పని వ్యక్తి 100కు ఫోన్ చేసి ఐరన్‌బండ గ్రామంలో హత్యలు చేసుకునేందుకు ఇరువర్గాల వారు మారణాయుధాలతో సిద్ధంగా ఉన్నారు అని చెప్పడంతో గోనెగండ్ల పోలీసులు అప్రమత్తమయ్యారు. మంగళవారం ఉదయం గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, 5మంది ఎస్ఐలు, ఒక పీఎస్ఐ, 51 మంది పోలీస్ కానిస్టేబుల్స్ ఐరన్‌బండ గ్రామానికి వెళ్లారు. ఇరువర్గాలలోని అనుమానిత వ్యక్తుల ఇండ్లలో పోలీసులు సోదాలు చేశారు. మారణాయుధాలు ఉన్నాయా? లేదా? అని వారి ఇండ్లలో పోలీసులు జల్లెడపట్టారు. అయితే గ్రామానికి చెందిన పది మంది వ్యక్తుల దగ్గర ఎలాంటి అనుమతి పత్రాలు, నెంబర్ ప్లేట్స్ లేని 10 ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్థులు గొడవలకు దూరంగా ఉండాలని ఒకరిని నమ్మి మరొకరు గొడవలకు పోకూడదని కోరారు. గ్రామంలో ఎలాంటి గొడవలకు పోకుండా ఉంటారో వారికి పోలీసులు ఎల్లవేల సహకారం అందిస్తామన్నారు. చదువుకునే పిల్లలు ఉన్నకుటుంబాల వారు గొడవలకు దూరంగా ఉండాలని కోరారు. అలాగే పలు సూచనలు చేశారు. గ్రామం బాగుండాలని కోరుకుంటు పోలీసులకు సహకరించాలన్నారు. ఎవరి దగ్గర అయిన మారణాయుధాలు ఉన్నట్లు అయితే పోలీసులకు అప్పగించాలని కోరారు. ఇరువర్గాల వారికి పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.

ఉద్యోగాల పేరుతో మోసం

- డబ్బులు, సర్టిఫికెట్లు ఇప్పించాలి
- హొళగుంద మండలానికి చెందిన యువకుల ఆవేదన



మాట్లాడుతున్న బాధిత యువకులు

హొళగుంద, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆర్మీ, ఫారెస్ట్ డిపార్టుమెంట్లలో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేశారని, న్యాయం చేయాలని హొళగుంద మండలానికి చెందిన బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సోహెల్, ఈడిగ సురేష్, ఎరుకుల ఆంజనేయులు, సాయి కిషోర్ అనే నిరుద్యోగులతో పాటు హెబ్బటం, నాగరకన్వి గ్రామాలకు చెందిన మరో ఏడుగురు నిరుద్యోగులను అనంతపురం జిల్లాకు గార్లదిన్నె మండలానికి చెందిన ఇద్దరు అన్నదమ్ముళ్లు ఆర్మీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి మోసం చేశారని చెప్పారు. సోహైల్ దగ్గర నుంచి రూ.4.50 లక్షలు, సాయి కిషోర్ నుంచి రూ.4.2 లక్షలు, ఈడిగ సురేష్ నుంచి రూ.2లక్షలు, ఎరుకుల ఆంజనేయులు నుంచి రూ.2 లక్షలు, హెబ్బటం గ్రామానికి చెందిన నలుగురి వద్ద 8 లక్షలు, నాగరాకన్వికి చెందిన ఇద్దరి వ్యక్తుల నుంచి రూ.3 లక్షలు వసూలు చేసి మోసం చేశారని చెప్పారు. డబ్బులతో పాటు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు కూడా వారి వద్దనే పెట్టుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భారద్వాజ్‌కు స్పందనలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. హొళగుంద ఎస్ఐ దిలీప్ కుమార్ కూడా అకాడమీ నిర్వాహకులతో మాట్లాడినా వారు స్పందించలేదన్నారు. ఎస్ఐ దిలీప్ కుమార్‌ను వివరణ కోరగా.. పామిడి పోలీసులతో మాట్లాడామని, న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు.

అప్పు తెచ్చి కట్టాను

మా నాన్నా హమాలీ పని చేస్తుంటారు. పనిచేస్తే గానీ పూటగడవని కుటుంబం మాది.రూ.4.5 లక్షలు అప్పు తెచ్చి కట్టాము. వడ్డీ పెరిగిపోవడంతో పాటు అప్పుల వాళ్ల ఒత్తిళ్ల భరించలేకపో తున్నాం. తన తండ్రికి మొహం చూప లేక ఊరు వదలి పోవాలనిపిస్తోంది. **- సొహైల్, హొళగుంద గ్రామం**

డబ్బులు ఇప్పించాలి

నాకు ఉద్యోగం వస్తే, తన తమ్ముళ్ల జీవితాలు సైతం మారుతాయని, నా తండ్రిని ఒప్పించి తమ జీవనాధారం అయిన పందులను అమ్మించి ఉద్యోగం కోసం రూ.2 లక్షలు కట్టాను. తీరా మోసపోవడంతో ఏమి చేయాలో తోచడం లేదు. పోలీసులు స్పందించి, తమ డబ్బులు ఇప్పించాలి. **- ఎరుకుల ఆంజనేయులు, హొళగుంద గ్రామం**

పొలం తాకట్టు పెట్టి డబ్బులు ఇచ్చాను

మా కుటుంబానికి జీవనాధారమైన, ఎకరం పొలాన్ని తాకట్టు పెట్టించి రూ.2 లక్షలు ఇచ్చానని, అటు ఉద్యోగం లేక, ఇటు బతుకుతెరువు కోసం తీసుకున్న అప్పులకు వడ్డీలు కట్టలేక రూ.6వేల జీతానికి మందుల దుకాణంలో పని చేస్తున్నా. ఒక్క ఘటనతో జీవితం మొత్తం నాశనం అయిపోయింది. **- ఈడిగ సురేశ్, హొళగుంద గ్రామం**

ఉల్లిని గ్రేడింగ్ చేసి తీసుకురండి: జేసీ



ఉల్లి రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉల్లి దిగుబడులను గ్రేడింగ్ చేసి మార్కెట్‌కు తీసుకరావాలని జాయింట్ కలెక్టర్ నవ్య రైతులకు సూచించారు. మంగళవారం ప్యాలకుర్తి వద్ద రైతు మధుకృష్ణ పొలంలో జాయింట్ కలెక్టర్ నవ్య, జిల్లా వ్యవ సాయాధికారి వరలక్ష్మి ఉల్లిపైరును పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉల్లిపంటను కనీసం 120 రోజుల తర్వాతే కోత చేయాలని, ఆ తర్వాత తేమ లేకుండా బాగా ఆరబెట్టి గ్రేడింగ్ చేసి మార్కెట్‌కు తరలించాలని సూచించారు. ప్రభుత్వ మద్దతు ధర విషయంలో ఆందోళన చెందొద్దని అన్నారు. అంతకుముందు అధికారులు పత్తి పంటలు పరిశీలించి రైతులతో మాట్లాడారు. తహసీల్దార్ నాగరాజు, వ్యవసాయాధికారి రవిప్రకాష్, హార్టికల్చర్ అధికారి మదన్ మోహన్ ఉన్నారు.

నర్సింగ్ హోమ్‌ను సీజ్ చేయాలి

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని ఓ నర్సింగ్ హోంను సీజ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మహేంద్ర బాబు, యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఉదయ్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమైఖ్య జిల్లా అధ్యక్షుడు శేఖర్ డిమాండ్ చేశారు. కొద్ది రోజుల క్రితం మంత్రాలయం మండలం సూగూరు గ్రామానికి చెందిన ఓ గర్భిణి కాన్పు కోసం ఓ నర్సింగ్ హోమ్‌కు వచ్చిందన్నారు. అక్కడి వైద్యులు సాధారణ ప్రసవం చేయకుండా కాసుల కోసం కక్కుర్తి పడి సిజేరియన్ చేశారని, మత్తు ఇంజెక్షన్ అధిక మోతాదులో ఇవ్వడంతో గర్భిణితోపాటు కడుపులో శిశువు కూడా మృతి చెందిందన్నారు. ఆ నర్సింగ్ హోంపై విచారణ చేసి సీజ్ చేయాలని కోరుతూ మంగళవారం నాయకులు డీఎం హెచ్‌వో డాక్టర్ పి.శాంతికళకు వినతి పత్రం సమర్పించారు.



కల్వాలో నీటితో కళకళలాడుతున్న అమృత్ సరోవర్

జలకళ..

ఐదేళ్ల నుంచి వెలవెలబోయిన చెక్‌డ్యాంలు, చెరువులు, కుంటలకు జలకళ వచ్చింది. ఈఏడాది ఖరీఫ్ ప్రారంభం అయినప్పటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఒక్కసారిగా చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు పొంగి పొర్లాయి. బావుల్లో, బోర్లలో భూగర్భజలాలు పెరిగాయి. కర్నూలు డబ్ల్యూసీసీ పరిధిలోని శకునాల క్లస్టర్‌లో మైక్రోవాల్ షెడ్లు, ఓర్వకల్లు మండలంలోని శకునాల, కాల్వ, హుశేనాపురం, గుట్టపాడు, ఓర్వకల్లు, తిప్పాయపల్లె గ్రామాల్లో వాటర్‌షెడ్లు మంజూరయ్యాయి. ఈ గ్రామాల్లో రూ.3.15కోట్లతో చెక్‌డ్యాంలు, చెక్‌వాల్స్, ఊట కుంటలు, రాఫిల్ డ్యామ్స్, నీటికుంటలు నిర్మించారు. ఈఏడాది అధిక వర్షాలు పడటంతో ప్రస్తుతం అవన్నీ నీటితో కళకళలాడుతున్నాయి. భూగర్భ జలాలు పెరగడంతో బోర్లలో నీరు పెరిగిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నీరు సమృద్ధిగా ఉండటంతో పంటలు బాగా పండుతున్నాయి.

● ఓర్వకల్లు, ఆంధ్రజ్యోతి



హుశేనాపురంలో నీటితో కళకళాడుతున్న ట్యాంక్

'ఉల్లి రైతులను ఆదుకోవడంలో విఫలం'



మాట్లాడుతున్న రామచంద్రయ్య

కర్నూలు, న్యూసిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉల్లి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.రామచంద్రయ్య అన్నారు. మంగళవారం సీఆర్ భవన్‌లో రైతు సంఘం జిల్లా సమితి సమా వేశం జిల్లా అధ్యక్షుడు కే.నాగేంద్రయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రామచంద్రయ్య మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులు వేసుకున్న పంటలు అధిక వర్షాలతో నష్టపోయారన్నారు. ప్రభుత్వం ఉల్లి పంటను అరకొరగా కొనుగోలు చేసిందని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, జిల్లా కార్యదర్శి పంప్నగౌడు, ఉపాధ్యక్షుడు రాజా సాహెబ్, కౌలు రైతు సంఘం కార్యదర్శి తిమ్మయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

22 నుంచి లలితా పీఠంలో దసరా ఉత్సవాలు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పాతనగరంలోని లలితా పీఠంలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2 వరకు దసరా (దేవీ శరన్నవరాత్రి) ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి గురు మేడా సుబ్రహ్మణ్యం స్వామి తెలిపారు. సోమవారం లలితా పీఠం లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో వివిధ ధార్మిక సంఘాల ప్రతినిధులతో కలిసి ఆయన ఉత్సవాల బ్రోచర్లను విడుదల చేశారు. పీఠాధిపతి మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా దసరా ఉత్సవాలకు లలితా పీఠంలో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఇందులో భాగంగా ప్రతిరోజు ఉదయం ప్రాతఃకాల సుప్రభాతం, మూర్తి అభిషేకాలు, సప్త మంగళ హారతులు, ప్రసాద వితరణ ఉంటాయన్నారు. నిత్యం ఉచిత సామూహిక శ్రీచక్ర కుంకు మార్చనలు, శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామి వార్లకు విశేష పూజ, పల్లకీ సేవ, లలితా సుందరేశ్వరస్వామి వార్లకు రథో త్సవం ఉంటుందని తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం అమ్మవారికి విశేష అలంకరణలు, బాలబాలికలచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు శ్రీరామాంజనేయులు, దాసరి రామచంద్రారెడ్డి, పూడూరు లక్ష్మీరెడ్డి, మామిళ్లపల్లి రాజేశ్ శర్మ, శ్రీనివాస్, గురుస్వామి పాల్గొన్నారు.



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి, ధార్మిక సంఘాల ప్రతినిధులు

పంట నమోదు చేయించుకోవాలి

గూడూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులు పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి దస్తగిరి రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జులకల్ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ పంట నమోదు చేసుకున్న రైతులు మార్కెట్ యార్డుకు వెళ్లి ఉల్లి పంట అమ్ముకోవడానికి సులువుగా ఉంటుందన్నారు. అలాగే ఉల్లి పంటను 100-120 రోజుల తర్వాత మాత్రమే కోత చేయాలన్నారు. ఉల్లిని 10-15 రోజులు బాగా ఆరబెట్టి గ్రేడింగ్ చేసి మార్కెట్ యార్డుకు తరలించాలన్నారు.

కోడుమూరు రూరల్: మండలంలోని వెంకటగిరి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఇన్‌చార్జి ఏడీఏ శ్రీవర్ధన్‌రెడ్డి, వ్యవసాయాధికారి రవిప్రకాష్ హాజర య్యారు. ఉల్లి పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఉల్లి పంటలో రసాయనిక ఎరువులకు బదులుగా నానో డీఏపీ ఎకరాకు 500 ఎంఎల్ మోతాదు పిచికారి చేయాలని సూచించారు. ప్రతి రైతు ఆర్ఎస్కే సిబ్బందిని సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఇందూ, ప్రియాంక పాల్గొన్నారు.

కల్లూరు: కల్లూరు మండలం కొంగనపాడు గ్రామంలో మంగళవారం వ్యవసాయశాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి మండల ఏవో విష్ణువర్దన్‌రెడ్డి పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఉల్లిపంట వేసిన ప్రతి రైతు రెండు రెండు రోజుల్లో పంట నమోదు చేయించుకోవాలని వివరించారు. ఉల్లి రైతులు పంట పూర్తిగా కోత దశకు వచ్చేవరకు పంటకోత చేయరాదని సూచించారు. దీనిపై ప్రతి ఉల్లిరైతులు అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ అధికారి తెలిపారు. అంతేకా కుండా పత్తిపంటలో కాయకుళ్లు, తెగులుపై నివారణ చర్యలు గురించి రైతులకు అవగాహన కల్పించారు.

రోడ్డు నిర్మాణానికి రూ.1.83 కోట్లు



టీటీడీ చైర్మన్, ఈవోలకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యాల వాడ కొండపై వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయ రోడ్డు నిర్మాణా నికి నిధులు మంజురైనట్లు టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్ మంగళవారం తెలిపారు. మంగళవారం తిరుపతిలో టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింగాల్‌ను టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ కలిసి వేంకటేశ్వరస్వామి ఆలయ రోడ్డు నిర్మాణానికి నిధులు కోరారు. స్పందించిన టీటీడీ అధికారులు ఉయ్యాలవాడ నుంచి కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.1.83 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు మల్లెల రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, మల్లెల రాజశేఖర్‌లకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థి కుటుంబాన్ని ఆదుకుంటాం

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ పాఠశాలలో గోడ కూలి మృతి చెందిన విద్యార్థి రహిబ్‌బాషా కుటుంబాన్ని ఆదుకుం టామని కలెక్టర్ సిరి తెలిపారు. సోమవారం ఆమె బాధిత కుటుంబానికి ఆమె ఫోన్ చేసి పరామర్శించారు. ఆ పాఠశాలపై చర్యలు తీసుకుంటామని, బాధిత కుటుంబానికి ఇంటి స్థలం మంజూరు చేయాలని ఆర్డీవోను ఆదేశించారు. భవిష్యత్తులో ఎంత వరకు చదువుకుంటే అంతవరకు పిల్లల్ని చదివించే బాధ్యత తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జిల్లాలో ఇలా పాత బడిన పాఠశాలలకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

ఓర్వకల్లు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సుప్రియ అన్నారు. మంగళవారం హుశేనాపురం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ రేఖా ఆధ్వర్యంలో ఏపీఆర్ గురుకుల పైద్యశాలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థులకు డాక్టర్ సుప్రియ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఎంపీడీవో సేవలు మరువలేనివి

ఓర్వకల్లు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో శ్రీనివాసులు సేవలు మరువలేనివని డ్వామా పీడీ వెంకట్రామయ్య అన్నారు. మంగళవారం ఓర్వకల్లు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీని వాసులు పదోన్నతిపై డ్వామా జిల్లా అకౌంట్స్ ఆఫీసర్‌గా వెళ్తున్న సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు సన్మాన సభ నిర్వహించారు. తహసీల్దార్ విద్యా సాగర్, ఎంపీపీ తిప్పన్న టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి సుధాకర్‌రావు, తిప్పాయపల్లె సుధాకర్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం : కమిషనర్

కర్నూలు, న్యూసిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామని కార్పొరేషన్ కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. మంగళవారం ఆయన సీతారాం నగర్, కొత్తపేట, అశోక్ నగర్‌తో పాటు పలు ప్రాంతాలను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతిపాద నలు రూపొందిస్తున్నా మన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ శేష సాయి, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వర రెడ్డి, ఎంఈ మనోహర్‌రెడ్డి, డీసీపీ వెంకట రమణ, సిటీ ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్ బాషా, డీఈ గిరిరాజు, ఏఈ జనార్ధన్ పాల్గొన్నారు.

ఓజోన్ పొరను కాపాడుకుందాం: ప్రిన్సిపాల్

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓజోన్ పొరను కాపాడుకుందామని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి అన్నారు. మంగళవారం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా ఓజోన్ పొరను రక్షించడంలో శాస్త్రీయ అవగాహన సదస్సు జరిగింది. మైక్రోబయాలజీ అధ్యాపకులు హేమలత, శ్రీనివాస్, కామల్లీ నాయక్, సాజీదా బీ. విద్యార్థులు పాల్గొన్నారు.

● ఓజోన్ పొరను కాపాడుకుందామని కెమిస్ట్రి విభాగాధిపతి నాగరాజు శెట్టి అన్నారు. మంగళవారం సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశా లలో కెమిస్ట్రి విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. నాగరాజు శెట్టి మాట్లాడుతూ పర్యావరణ సమతు ల్యాన్ని ఓజోన్ పొర ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. కార్యక్ర మంలో అధ్యాపకులు వెంకన్న, అనుష, బంగారు బాబు, అల్తాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వీఏవోల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు, న్యూసిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): వీఏవోల సమ స్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్. రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట వీఏవోలతో కలిసి ధర్నా చేశారు. రాధాకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో వీఏవోలు ఆన్‌లైన్ పనులతో ఇబ్బందులు పడుతున్నారని, రాజకీయ ఒత్తిళ్లతో ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. కాల పరి మితి సర్క్యులర్ రద్దు చేయాలని, వేతనాలు పెంచాలని, హెచ్‌ఆర్‌పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీఏవోల సంఘం అధ్యక్షుడు గుంటెప్ప, వెంకట స్వామి, మారెప్ప, రాజమ్మ, షబిరా బేగం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సులో పీజీ విద్యార్థినికి ప్రథమ బహుమతి

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల కోయంబత్తూరులో జరిగిన పీడీయాట్రిక్ సర్జరీ జాతీయ వైద్యుల సదస్సులో పీడీయాట్రిక్ సర్జరీ రెండో సంవత్సరం పీజీ విద్యార్థిని డా.ప్రియాంక ఇ.పోస్టర్ విభాగంలో జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి సాధించింది. మంగళవారం కర్నూలు మెడికల్ కాలేజీ లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ పీజీ విద్యార్థిని ప్రియాంక, పీడీయాట్రిక్ సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ శివకుమార్‌లను అభినందించారు.

పుల్లగుమ్మి రైతులకు న్యాయం చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

కల్లూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలం పుల్లగుమ్మి గ్రామ రైతులకు న్యాయం చేయాలని, పోలీసులను రైతుల భూముల వద్దకు పంపి భయభ్రాంతులకు గురి చేయ వద్దని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ అన్నారు. మంగళవారం కల్లూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట పుల్లగుమ్మి గ్రామ రైతులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని, వారి భూముల్లో ఐరన్ ఓర్ యజమాని సీతారామయ్య లారీలు, టిప్పర్లు పోయే ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సీతారామయ్య ఐరన్ ఓర్ లీజ్‌కు తీసుకొని రైతుల భూముల్లో ప్రవేశించి ఆందోళనకు గురిచేస్తున్నారని అన్నారు. అనంతరం తహసీల్దారు ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ, బాధిత రైతులు లక్ష్మన్న, రాజు, నాగరాజు, సుశీలమ్మ, నాగమ్మ పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు సహకరించాలి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు, న్యూసిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని గౌరీ గోపాల్ వద్ద వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని ఆ సంఘం నాయకులు కోరారు. మంగళవారం కార్పొరేషన్ కమిషనర్ పి.విశ్వనాథ్‌ను వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఏపీ సివిల్ సప్లయీస్ డైరెక్టర్ మహేష్‌నాయుడు మాట్లాడుతూ అక్టోబరు 7న వాల్మీకి జయంతిని పురస్కరించుకుని విగ్రహ ఏర్పాటుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామాంజనేయులు, మద్దిలేటి, రామాంజనేయులు, కుబేరస్వామి, కుంపటి కృష్ణయ్య, బేతం కృష్ణుడు, తలారి కృష్ణ పాల్గొన్నారు

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో రాణించా లని జిల్లా స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాఘవేంద్ర అన్నారు. మంగళవారం స్థానిక డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన అండర్-19 ఉమ్మడి కర్నూలు జిల్లా జట్టు బీచ్ వాలీబాల్ జట్ల ఎంపికలను ఆయన ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు నాగశేషులు, సుధాకర్, నర్సప్ప, రాజేశ్వరి, శ్రీనివాసులు, ప్రకాష్, హుకుం సింగ్, విజయభాస్కర్ రెడ్డి, కిరణ్ కుమార్, రవి, నాగన్న, వాలీబాల్ శిక్షకులు రవితేజ, రాజేష్ పాల్గొన్నారు.

నేడు స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా అండర్-19 బాలబాలికలకు బుధవారం నుంచి క్రీడా ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు +2 కార్యదర్శి రాఘవేంద్ర తెలిపారు. వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాటర్ పోలో, స్విమ్మింగ్ అండర్ రైఫిలింగ్, రగ్బీ క్రీడాంశాలలో ఎంపిక నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి తెలిపారు. 1.1.2007 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. ఉమ్మడి జిల్లాల క్రీడాకారులు (అం డర్-19 బాలబాలికలు) ఎంపికకు హాజరు కావాలన్నారు.

రెండో రోజూ విద్యుత్ కార్మికుల నిరసన

ఓర్వకల్లు, న్యూసిటీ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ కార్మికులు చేపట్టిన నిరసన మంగళవారం రెండో రోజుకు చేరింది. నన్నూరు 400 కేఈ సబ్ స్టేషన్ ఎదుట విద్యుత్ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా జేఏసీ నాయకుడు సత్యానారాయణ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులకు హైలెవెల్స్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పోలయ్య, భరత్ కుమార్, లక్ష్మయ్య, మహ్మద్ పాల్గొన్నారు.

ఉల్లిపంట పరిశీలన

సి.బెళగల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబద హాల్ గ్రామంలో ఉల్లిపంటను వెంకటలక్ష్మి, ఏవో మల్లేష్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉల్లిసాగు చేసిన రైతులు పంట కోత తర్వాత బాగా ఆరబెట్టాలని సూచించారు. అనంతరం ఉల్లిగడ్డలను గ్రేడింగ్ చేసి మార్కెట్‌కు తరలించాలని, ప్రభుత్వం ఉల్లికి మద్దతు ధర రూ.1200తో కొనుగోలు చేస్తుందని అన్నారు.

దళిత పక్షపాతి పవన్ కల్యాణ్

జనసేన ప్రతినిధి వెంకటరాముడు



కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజన పక్షపాతి పవన్‌కల్యాణ్ అని జనసేన పార్టీ కోడుమూరు ప్రతినిధి వై.వెంకటరాముడు అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ శ్రేణులు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై సామాజిక మాధ్యమాల్లో విష ప్రచారం చేయడం తగదన్నారు. పవన్‌కల్యాణ్‌కు దళిత, గిరిజనులను దూరం చేయాలనే కుట్రలో భాగంగా ఈ చౌకబారు ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ రుణాల మంజూరు పథకాల అమలులో తీవ్ర నిర్లక్ష్యం చేశారని, కూటమి ప్రభుత్వం ప్రతి వర్గానికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందిస్తోందని అన్నారు

రేపు ఔషధం పంపిణీ

ఆదోని టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు స్వర్ణామృత ప్రాసన ఔషధాన్ని గురువారం పంపిణీ చేయనున్నట్లు ఆవోపా సంస్థ అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ ఆరు నెలల నుంచి 16 సంవత్సరాల్లోపు చిన్నారులకు పట్టణంలోని అభయాంజనేయ స్వామి ఆలయం ప్రాంగణంలో పంపిణీ చేసాత్మని, అవసరమైనవారు 984947417 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లను నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు.

జాబితాను సరిగా రూపొందించాలి

ఆదోని టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రానున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఓటరు జాబితాను అవకతవకలకు అవకాశం లేకుండా రూపొందించాలని మండిగిరి టీడీపీ ఇన్‌చార్జి శ్రీనివాస ఆచారి, మాజీ కౌన్సిలర్ బాలాజీ కోరారు. మంగళ వారం సబ్ కలెక్టర్ భరద్వాజ్‌కు వినతి పత్రం ఇచ్చారు. గత ఎన్నికల్లో ఓటరు జాబితాలో తప్పులు ఉండి, చాలా మంది ఓటు వేయలేకపోయారన్నారు. ఈ సారి పొరపాట్లు చోటుచేసుకోకుండా చూడాలని కోరారు.


వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఆలూరును సస్యశ్యామలం చేస్తాం


మ్యాప్‌ను పరిశీలిస్తున్న జలవనరుల శాఖాధికారులు

హాలహర్వి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కరువు ప్రాంతమైన ఆలూరును సస్యశ్యామలం చేసేందుకు చెరువుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతున్నామని చిన్న నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ కబీర్‌బాషా అన్నారు. మంగళవారం హాలహర్వి, మెదేహాల్, చింతకుంట అలుగులతో పాటు వేదవతి నదిని పరిశీలించారు. ఇక్కడ చెరువులను నిర్మిస్తే 400 నుంచి 800 ఎకరాలకు సాగునీరు ఇవ్వొచ్చని అంచనా వేశారు. చిన్నపాటి వర్షం వచ్చినా చెరువులు నిండే అవకాశం ఉందని, ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. హంద్రీనావా ఎస్ఈ పాండురంగ, డీఈ షఫీవుల్లా, ఏఈ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గార్డు కుటుంబానికి సాయం

ఆస్పరి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విండో పవర్ కంపెనీ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ మృతిచెందిన చక్రాల శ్రీనివాసులు కుటుంబానికి ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు కృష్ణమూర్తి, కె.వీరేష్ మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. సాయం అందించారు. మృతుడి భార్య నాగేంద్రమ్మకు రూ.30 వేలను సెక్యూరిటీ గార్డ్స్ వర్కర్స్ యూనియన్ తరఫున అందజేస్తున్నట్లు తెలిపారు.


నగదును అందజేస్తున్న నాయకులు

నేటి నుంచి మెగా రక్తదాన శిబిరం

ఆదోని/ఆదోని టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా 17వ తేదీ బుధవారం నుంచి మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు బీజేపీ నాయకుడు విట్టా రమేష్ తెలిపారు. మంగళవారం మట్లాడుతూ 15 రోజులపాటు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద నిర్వహిస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆహ్వానించారు. శ్రీరాములు, నాగరాజు గౌడ్, ఉపేంద్ర కుమార్, అంజయ్య కుమార్ పాల్గొన్నారు.

వీవోఏ మాయాజాలం

● పొదుపు మహిళలను మోస చేసిన ఉద్యోగి

దేవనకొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.కోటకొండ గ్రామానికి చెందిన మిన్నెల్ల హుసేన్(వలి) కొన్నేళ్లుగా వీవోఏ (బుక్‌కీపర్)గా పనిచేస్తున్నాడు. కాగా వలి అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఎనిమిది పొదుపు సంఘాల మహిళలు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం కర్నూలు నుంచి లీగల్ కో ఆర్డినేటర్ ముర్తుజా, దేవనకొండ సీసీలు కర్రెన్న, సోమన్న, మల్లేశు, బీయం రంగడు, మస్తాన్ గ్రామానికి చేరుకు విచారించారు. గతేడాది, ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చిలో 8 సంఘాలకు గాను స్త్రీనిధి ద్వారా రూ.40 లక్షల దాకా రుణం మంజూరు చేశారు. స్థానిక ఏపీజీబి నందు పొదుపు సంఘాల నుంచి కంతులను ఆటో డెబిట్ పెట్టించడంతో సభ్యుల ప్రమేయం లేకుండానే స్త్రీనిధి ఖాతాకు జమఅవుతాయి. సభ్యులు కంతులను నగదు రూపం లో వీవోఏకి చెల్లించారు. అయితే ఖాతాలోని నగదు మయం కావడంతో సభ్యులు బ్యాంకులో విచారణ చేయగా అసలు విషయం బయట పడింది.

వరండా చదువులు

● పెండేకల్ పాఠశాలలో పూర్తికాని అదనపు తరగతి గదులు



వరండాలో చదువుతున్న విద్యార్థులు, ఇన్‌సెట్‌లో పూర్తికాని తరగతి గదులు

తుగ్గలి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం నాడు-నేడు కింద చేపట్టిన అదనపు గదుల నిర్మాణం పూర్తి కాకపోవడంతో విద్యార్థులు వరండాల్లోనే విద్యనభ్యసిస్తున్నారు. మండలంలోని పెండేకల్ మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 3వ తరగతి నుంచి 8వ తరగతి వరకు దాదాపు 220 మంది విద్యార్థులు చదువుతున్నారు. గదులు తక్కువగా ఉండటంతో గత ప్రభుత్వ హయాంలో నాలుగు అదనపు గదుల నిర్మాణాన్ని ప్రారంభించారు. అయితే ఏళ్లు గడుస్తున్నా నిర్మాణాలు పూర్తి కాలేదు. దీంతె విద్యార్థులను వరండాలో కూర్చోబెట్టి చదివిస్తున్నారు. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు స్పందించి తరగతి గదుల నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

'టొమోటాకు మద్దతు ధర'

● పత్తికొండ మార్కెట్ యార్డు కార్యదర్శి కార్నలీస్


టమోటా కొనుగోళ్లను పరిశీలిస్తున్న కార్యదర్శి కార్నలీస్

పత్తికొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డులో టమోటాకు మద్దతు ధర ఇస్తున్నామని కార్యదర్శి కార్నలీస్ అన్నారు. మంగళవారం టమోటాలను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ ఈ ఏడాది ఆరంభంలో మంచి ధర వచ్చిందని, అయితే గత వారం ధరలు పడిపోయాయన్నారు. విషయాన్ని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి కిలో రూ.8ల చొప్పున కొనుగోలు చేయాలని మార్కెట్‌యార్డుద్వారా ఆదేశించారన్నారు. సీఎం ఆదేశాల మేరకు మార్కెట్ యార్డు తరఫున మూడురోజులు కొనుగోలు చేశామన్నారు.

అయితే సోమవారం నాణ్యతను బట్టి కిలో రూ.10ల వరకు ధర పలికిందని, మంగళవారం కిలో రూ.15ల వరకు చేరిందన్నారు. ప్రభుత్వ ధర కంటే అధికంగా వ్యాపారులు ఇస్తుండటంతో తాముయ కొనుగ్లోను నిలిపివేశావన్నారు. ఒకవేళ ధరలు తగ్గితే తిరిగా మార్కెట్‌యార్డు తరఫున గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన చెందవద్దు.

గిట్టుబాటు ధర కల్పించాలి


ఉల్లి రైతులతో మాట్లాడుతున్న శ్రీదేవి

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉల్లి, టమాటా పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ పరిసర ప్రాంతాల్లో సాగుచేసిన ఉల్లి, టమాటా పంటలను పరిశీలించి, రైతుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్‌యార్డులో నిర్వహిస్తున్న టమాటా మార్కెట్‌ను సందర్శించి వ్యాపారులు ఎంతకు కొనుగోలు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. కాగా కిలో రూ.2లకే కొనుగోలు చేస్తున్నారని రైతులు తెలిపారు. శ్రీదేవి మాట్లాడుతూ పత్తికొండ పరిసర ప్రాంతాల్లో టమాటా జ్యూస్ ఫ్యాక్టరీని పూర్తిచేఆయలన్నారు. ఉల్లికి ధర లేక రైతులు పంటలను దున్నేస్తూ తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా రైతులను ఆదుకోకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఎంపీపీ నారాయణదాస్, బాబుల్‌రెడ్డి, శ్రీరంగడు, నాగరాజు, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యపై విచారణ


గ్రామంలో విచారణ చేస్తున్న అధికారులు

వెల్దుర్తి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొసనపల్లి గ్రామంలో రైతు రామచంద్రుడు ఆత్మహత్యపై గ్రామంలో విచారణ చేశారు తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఏడీఏ మోహన్‌విజయ్‌కుమార్, ఏవో అక్బర్‌బాషా రైతు కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. ఆర్థిక సాయం అందేలా ప్రభుత్వానికి నివేదికను అందజేస్తామన్నారు. రైతులు ఆత్మహత్యకు పాల్పడవద్దని కోరారు. ఆర్ఐ మంజుల, హెచ్ఈవో ఉదయ్ పాల్గొన్నారు.

ఆదోని జిల్లా సాధనకు ఉద్యమిద్దాం

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదోని జిల్లా సాధనకు కలిసికట్టుగా ఉద్యమిద్దామని జిల్లా సాధన కమిటీ నాయకులు కోదండ కోరారు. మంగళవారం బీసీ ఫెడరేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వం నూతన జిల్లాలను ఏర్పాటు చేసినా, ఆదోనిని పక్కన పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం నియోజకర్గాలను కలిపి ఆదోని జిల్లాగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 19న పట్టణ ప్రజలతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. నాయకులు సుజ్ఞానమ్మ, శేక్షావలి, రామలింగ, దస్తగిరి నాయకుడు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకుడు కోదండ

కౌలు హక్కు పత్రాలు ఇవ్వండి

ఆదోని రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలను ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు డిమాండ్ చేశారు. మంగళవారం రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈక్రాప్ నమోదు చేయాలని, బ్యాంకులో పంట రుణాలు ఇప్పించాలన్నారు. అనంతరం తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం ఇచ్చారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రెండు రోజులు ఉల్లి కోతలు వద్దు


చెన్నంపల్లిలో పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

తుగ్గలి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులు పాటు ఉల్లి కోతలు వద్దని ఏవో సురేష్ యాదవ్ తెలిపారు. మగళవారం చెన్నంపల్లిలో పొలం పిలుస్తుందిలో భాగంగా వేరుశనగ, ఉల్లి, కంది పంటలపై రైతులకు సలహాలు, సూచనలు చేశారు. ఉల్లి సాగు చేసిన 110 రోజులు పూర్తయ్యాకే, వాతావరణ సూచనలు గమనించి పంట కోత కోయాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ అందజేయాలన్నారు. 18, 19 తేదీల్లో మాత్రమే బెంగుళూరు మార్కెట్‌కు తరలించగలరన్నారు. ఏఈవోలు లక్ష్మీనారాయణ, మల్లేష్ ఉన్నారు.

శవ రాజకీయాలు మానుకోండి..

వెల్దుర్తి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు శవ రాజకీయాలు మానుకోవాలని టీడీపీ కన్వీనర్ బలరాంగౌడ్, సింగిల్‌విండో ఛైర్మన్ రమాకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ కొసనపల్లి గ్రామంలో వ్యక్తిగత కారణాలతో రైతు చనిపోయాడని, నిజనిజాలు తెలుసుకోకుండా ఉల్లికి గిట్టుబాటు ధర లేకపోవడంతో చనిపోయడాలని ప్రచారం చేయడం తగదన్నారు. ఉల్లికి క్వింటా రూ.1,200త మద్దతు ధర ప్రకటించి, మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని తెలిపారు

రైతులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

మద్దికెర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉల్లి, టమోటా నౌతేలపే ఆదుకోవాలని వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం మాట్లాడుతూ ధర వస్తుందని రైతులు ఈ ఏడాది ఉల్లి, టమోటాను సాగు చేస్తే ధర పడిపోయిందని, పొలాల్లోనే వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి కొనుగోళ్లను నిలిపివేశారన్నారు. టమోటా ధిగుబడి ఉన్నా కొనేవారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. తెలిపారు. నాయకులు గంధం చంద్రశేఖర్, మల్లికార్జున ఉన్నారు.

విద్యుత్ బిల్లులు చెల్లించాలి

తుగ్గలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించాలని ఏఈ సుజాత కోరారు. మంగళవారం మండలంలోని గ్రామాల్లో వినియోగదారులతో మాట్లాడారు. విద్యుత్ బిల్లుపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చెల్లించవచ్చాన్నారు. ఎస్సీ, ఎస్టీలు కరెంటు హీటర్లను వాడితే 200 వందల యూనిట్లకు మించి బిల్లు వస్తుందదన్నారు. బిల్లులు చెల్లించకపోతే సర్వీసు తొలగిస్తామన్నారు.

సీడీపీవోగా డిల్లీశ్వరి

ఆదోని రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదోని సీడీపీఓగా డిల్లీశ్వరి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గుత్తి సీడీపీఓగా విధులు నిర్వహిస్తూ, ప్రసూతి సెలవుపై వెళ్లారు. అనంతరం ఆదోనికి బదిలీ అయ్యారు. ప్రభుత్వం అంగన్‌వా డీ కేంద్రాల ద్వారా లబ్దిదారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకుంటానన్నారు.



ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం


విరాళం ఇస్తున్న దాత పారా విశ్వనాథ్

మద్దికెర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామానికి చెందిన పారా విశ్వనాథ్ (చిట్టెన్న), తుగ్గలి మండలం రాతన గ్రామంలో మాజీ సీఎం, దివంగత నందమూరి తారక రామారావు విగ్రహ ఏర్పాటుకు రూ.లక్ష వివరాళం ఇచ్చారు. మంగళవారం జిల్లా టీడీపీ నాయకుడు మనోహర్ చౌదరికి నగదు అందజేశారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సహకారంతో విగ్రహ ఏర్పాటును త్వరగా పూర్తి చేస్తామన్నారు.

బస్సు పరిశీలన..

హొళగుంద, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ శివారులో ఆర్టీసీ బస్సు తగిలి పెద్దహ్యాట గ్రామానికి చెందిన రంజిత్ మృతి చెందిన సంఘటన పాఠకులకు విదితమే. బస్సు డ్రైవర్ హనుమంతుపై కేసు నమోదైంది. ఆదోని ఏఎంవీఐ కేఎండీ ఆవేష్ మంగళవారం పోలీస్ స్టేషన్‌లో బస్సును పరిశీలించారు.

మార్కెట్ యార్డు పాలకవర్గ ఎంపికపై కసరత్తు


క్లస్టర్ ఇన్‌చార్జిలతో మాట్లాడుతున్న పరిశీలకులు

ఆలూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ఎంపికపై టీడీపీ అధినాయకత్వం దృష్టి సారించింది. ఈ మేరకు ఆలూరు ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్లు ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ పూల నాగరాజు, ఎంపీ బస్తిపాటి నాగరాజు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఇప్పటికే ఛైర్మన్‌గా బిల్లేకల్ వెంకటేష్ పేరును అధిష్ఠానం ప్రకటించింది. ఇంకా వైస్ ఛైర్మన్‌తో పాటు డైరెక్టర్ల ఎంపిక కూడా పూర్తి చేసేందుకు కసరత్తు ఆరంభించారు. ఇన్‌చార్జి వీరభద్రగౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, జ్యోతిని కూడా వీరు సంప్రదించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌యాదవ్ ఆదేశాల మేరకు జాబితా పంపుతామని పరిశీలకుడు తెలిపారు.

క్రీడలతో శారీరక ధృడత్వం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేఈ కృష్ణమూర్తి

పత్తికొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో చిన్నారుల్లో శారీరక ధృడత్వం, మానసిక వికాసం అలవరుతుందని మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం పత్తికొండలో ఈనెల 25 నుంచి నిర్వహించనున్న అండర్-16 క్రికెట్ పోటీల పోస్టర్లను మంగళవారం కర్నూలులో ఆవిష్కరించారు. పత్తికొండ క్రీడాకారుల సహకారంతో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు సభ్యుడు అంజి తెలిపారు. 11టీంలను ఎంపిక చేశామని, క్రీడాకారులకు భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు. క్రికెట్ అడ్మినిస్ట్రేషన్ అధికారి రమేష్‌బాబు, శ్రీనివాసులు, బిఎన్‌ప్రసాద్, శ్రీనివాసులు గౌడ్, ఇర్ఫాన్, కాశన్న ఉన్నారు.

18, 19న ఉల్లిని తీసుకు వెళ్లవద్దు

మద్దికెర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18, 19 గురు, శుక్రవారాల్లో కర్నూలు మార్కెట్ యార్డుకు ఉల్లిని తీసుకెళ్లవద్దని ఏవో రవి సూచించారు. మంగళశారం మాట్లాడుతూ అధికారులు ఆదేశాల మేరకు కర్నూలు యార్డులో రెండు రోజుల పాటు కొనుగోళ్ల నిలిపివేశారన్నారు. అవసరమైతే ఆ రోజుల్లో ఎమ్మిగనూరు యార్డుకు తీసుకెళ్లాలన్నారు.

నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యమివ్వాలి


ఎంపీకి సమస్యలు విన్నవిస్తున్న టీడీపీ నాయకులు

ఆలూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పనిచేసినవారికి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యమివ్వాలని టీడీపీ నాయకులు కోరారు. మంగళవారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ పూల నాగరాజుకు విన్నవించారు. ఆలయ కమిటీలు, మార్కెట్ కమిటీలతో పాటు కార్పొరేషన్ల పదవులు ఇవ్వాలన్నారు. ఆలూరు ప్రాంతంలో రహదారులకు మరమ్మతులుచేయాని, వేదవతి ప్రాజెక్టు కోసం నిధులు మంజూరయ్యేలా చూడాలన్నారు. కామినహాల్ రమేష్, హాలహర్వి జెడ్పీటీసీ కురువ లింగప్ప, కమ్మరచేడు దేవేంద్ర, వెంకటేష్, ముద్దురంగ, నరసప్ప, గూళ్యం రామాంజినేయులు, రాజు పాల్గొన్నారు.

విద్యార్థి బస్సును అడ్డుకున్న విద్యార్థులు

● సమ్మతగేరి గ్రామం నుంచి వెళ్లాలని డిమాండ్


బస్సును అడ్డుకున్న విద్యార్థినులు

హొళగుంద, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సమ్మాతగేరి గ్రామానికి చెందిన విద్యార్థులు మంగళవారం ఉదయం విద్యార్థి బస్సును అడ్డుకున్నారు. సమ్మతాగేరి క్రాస్ వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కొన్ని నెలలుగా విద్యార్థి బస్సు గ్రామానికి రాకపోవడంతో 2 కి.మీ.ల దూరం నడిచి రావలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 60 మందికి పైగా విద్యార్థులు హొళగుంద జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్నామన్నారు. బస్సు గ్రామంలోకి రావడంతో నిరసన విరమించారు.

సీడీపీవోపై చర్యలు తీసుకోవాలి

ఆలూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ ఉద్యోగులను వేధిస్తున్న ఆలూరు సీడీపీవో నరసమ్మపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు మునిస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం అంబేడ్కర్ కూడలిలో నిరసన తెలిపారు. కురువల్లి అంగన్‌వాడీ టీచర్ భువనేశ్వరిని వేధించడంతో ఆమె ఆసుపత్రి పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ తన బంధువని చెపుతూ ఉద్యోగులను పర్సంటేజీల కోసం వేధిస్తున్నారని ఆరోపించారు.

సారా బట్టీలపై దాడులు

హొళగుంద, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరణికి, నేరణికి తండా, కొత్తపేట కొండల్లో సారా స్థావరాలపై సీఐ రవి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో దాడులు చేసినట ఎస్ఐ దిలీప్ కుమార్ గురజాల తెలిపారు. మంగళవారం 70 లీటర్ల బెల్లంఊట, 10 లీటర్ల సారాను ధ్వంసం చేశామన్నారు. సారా తయారు చేసినా, అమ్మినా చర్యలు తప్పవన్నారు.


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్ఐ దిలీప్ కుమార్, పోలీసులు

హాస్టల్ పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హొళగుంద, సెప్టెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): రాజానగర్ కాలనీని ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ బాలుర హాస్టళ్లను పరిశీలించినట్లు ఆదోని సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి వెంకటరాముడు మంగళవారం తెలిపారు. ఈనెల 8న ఆంధ్రజ్యోతి లో 'అలా వదిలేశారు' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో కలెక్టర్ సిరి ఆదేశాల మేరకు పరిశీలించినట్లు తెలిపారు. హాస్టళ్లను పునః ప్రారంభిం చేందుకు కలెక్టర్ సానుకూలంగా ఉన్నారని తెలిపారు. డీటీ ముకుందరావు, నాగమద్దయ్య, సిద్దప్ప, వీఆర్వో మల్లేష్, నాగరాజు పాల్గొన్నారు.


హాస్టల్ వద్ద అధికారులు

ముగిసిన దశమి మహోత్సవాలు



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

గోనెగండ్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కొలిచేవారికి కొంగు బం గారంగా, భక్తుల కొర్కెలు తీర్చే కలియుగ దైవంగా చింతలాముని నల్లారెడ్డిస్వాములవారి దశమి వేడుకలు మంగళవారం ఆరాధనోత్సవాలతో ఘనంగా మగిశాయి. భాద్రపద మాసం బహుళ పంచమిలో దశిమి ఉత్సవానికి ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఆకుపూజ, మహామంగళహారతి, సహస్ర అర్చన, పల్లకోత్సవం నిర్వహించారు.

భక్తులకు ప్రత్యేక సదుపాయాలు

ఏపీ నుంచే కాక కర్ణాటక, తెలంగాణ నుంచి వేలాది మంది భక్తులు ఈ వేడుకలకు హాజరయ్యారు. వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా దేవాలయ నిర్వాహకులు ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటుచేశారు. ఉచిత బోజన సౌకర్యం, రాత్రి బన కార్యక్రమాలు చేపట్టారు. అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

ప్రముఖుల ప్రత్యేక పూజలు

చింతలాముని నల్లారెడ్డి స్వామివారి దశిమి మహోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, జనసేన నాయకులు రాలు రేఖాగౌడ్, వైసీపీ నాయకులతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు ఐదు రోజుల పాటు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు



పల్లకీ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు



ఓబిలేసు స్వామి గుడికి వెళ్తున్న పీఠాధిపతి

రైతులకు అవగాహన ఉండాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు తాము సాగుచేస్తున్న పంటపొలాల్లో మట్టి సేకరణ చేసే ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు శాస్త్రీయ పద్ధతిలో మట్టి నమూనాలను ఎలా సేకరించాలనే విషయాలను రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో నిరంజన్‌రెడ్డి, మౌనిక, శ్రీచందన, తేజాకుమారి, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలకు మంత్రాలయం విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయినులు

మంత్రాలయం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అక్షయ అనే విద్యార్థిని రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైందని పాఠశాల హెచ్‌ఎం విఠోభరావు, ఫిజికల్ డైరెక్టర్లు రవింద్ర, నరసింహరాజు తెలిపారు. రెండు రోజుల క్రితం రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా బాలికల కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఇందులో మంత్రాలయం జడ్పీఉన్నత పాఠశాలలో చదువుతున్న అక్షయ రైడింగ్, డిఫెండింగ్‌లో చక్కటి ప్రతిభ కనబరిచి ఎంపికైంది. ఈ నెల 22న ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. దీంతో విద్యార్థినిని ఉపాధ్యాయులు సుల్తానా, ఉమామహేశ్వరి,వరలక్ష్మి, ప్రసన్న కుమారి, చంద్రశేఖర్, గోపాల్, పాపన్న పాల్గొని అభినందించారు.

పత్తి పంటలో తేమ లేకుండా చూసుకోవాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏవో శేషాద్రి

కౌతాళం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని పత్తి పంట దెబ్బతినే అవకాశం ఉండటంతో రైతులు ముందుగా పంట దిగుబడి తగ్గకుండా తగిన చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి శేషాద్రి తెలిపారు. మంగళవారం తన సిబ్బందితో కలిసి మండలంలో పత్తి పంటను పరిశీలించారు. మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి పంటలో తేమ శాతం ఎక్కువ కావడంతో పంటకు తెగుళ్ళు, వ్యాధులు సోకే ప్రమాదం ఉందని దీని వల్ల పంట దిగుబడి తగ్గుతుందన్నారు. .ఎవరైన రైతులు ఉల్లి పంటను కోస్తే ఈనెల 17,18 తేదిల్లోపు ఎమ్మిగనూరు మార్కెట్‌కు తీసుకువెళ్ళాలన్నారు. వీఏఏలు నాయక్, కార్తిక్ పాల్గొన్నారు.

జాగ్రత్తలు అవసరం



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ మహ్మద్ ఖాద్రి, ఏవో జీరగణేష్

మంత్రాలయం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు పత్తి పంటకు జరుగుతున్న నష్టంపై జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి నాగ సరోజమ్మ, ఏడీఏ మహ్మద్ ఖాద్రి, ఏవో జీర గణేష్ అన్నారు. మంగళవారం మండలంలోని మాధవరం, రచ్చుమర్రి గ్రామాల్లో పత్తి రైతులకు అవగాహన కల్పిస్తూ సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం పత్తి పంటను పరిశీలించి తగుజాగ్రత్తలు చేసి పలు సూచనలు, సలహాలు చేశారు. సమావేశంలో ఏఈవో తిరుమల్ రెడ్డి, వీఏఏలు రాజేష్, విజయ్, సురేంద్ర, రాంజాన్, రైతులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన



ట్యాంక్ బండ్ రోడ్డులో పనులను పరిశీలిస్తున్న కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ట్యాంక్ బండ్ రోడ్డులో కో - ఆపరేటివ్ స్టోర్స్ సొసైటీ పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని అభివృద్ధిలో భాగంగా ట్యాంక్ బండ్ రోడ్డు నందు మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా సర్వే చేసి ఇంతకు ముందు కో - ఆపరేటివ్ స్టోర్స్ సొసైటీలో ఇక్కడ ఉన్న ఆక్రమణ షాపులను తొలగించి, వాటి స్థానంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేటట్లు చర్యలు చేపట్టాలని టౌన్ ప్లానింగ్ అధికారి రాజేష్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కో - ఆపరేటివ్ స్టోర్స్ సొసైటీ చైర్మన్ గట్టు అల్తాఫ్ పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి

కోసిగి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చావిడి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి వలకలదిన్నె వెంకటేష్ ఆధ్వర్యంలో కోసిగిలో నిర్వహించిన బాలబాలికల కబడ్డీ సెలక్షన్స్ సందర్భంగా కర్నూలు జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన బాలుర కబడ్డీ క్రీడాకారులకు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి జెర్సీలకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కబడ్డీ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

గోనెగండ్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రెగ్యులర్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విద్యుత్ జేఏసీ సంఘం నాయకులు రాయచోటి స్వామి, రంగస్వామి, మురళి డిమాండ్ చేశారు. గోనెగండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర మంగళవారం విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి సంఘం నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అనిల్, మహబుబ్‌బాషా పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీ

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ప్రాంతంలో మంగళవారం రాత్రి జిల్లా మైనింగ్‌శాఖకు చెందిన విజిలెన్స అధికారులు తనిఖీలు నిర్వహించారు. అధికలోడుతో వెళ్తున్న గ్రానైట్ లారీని స్వాధీనం చేసుకున్నారు. గ్రానైట్ లారీని స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో అప్పజెప్పి వెళ్లారు. నిబంధనలకు విరుద్ధంగా అధికలోడ్‌తో వెళ్తుండటంతో తనిఖీచేసి స్వాధీనం చేసుకొని సీజ్ చేశామని విజిలెన్స్ అధికారులు తెలిపారు.

చెక్క రథంపై ప్రహ్లాదరాయలు



చెక్క రథంపైవిహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం లో ఉత్సవమూర్తి ప్రహ్లాద రాయలు చెక్క రథంపై విహరించారు. మంగళవారం భాద్రపద దశమి శుభ దినంను పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో పండితులు,అర్చకులు రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి విశేష పూజలు నిర్వహించారు. చెక్క రథంను వివిధ పుష్పాలతో చూడ ముచ్చటగా అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాలు భక్తుల హర్ష ధ్వనాల మధ్య ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగాణం చుట్టూ ఊరేగించారు.

రాఘవేంద్రుని దర్శించుకున్న సినీ నటుడు: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ప్రముఖ సినీ హాస్యనటుడు నగేష్ తనయుడు తెలుగు,తమిళ సినీ నటుడు,బుల్లీ తెర నటుడు ఆనంద్ బాబు మంగళవారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు.

నేడు ఏకాదశి- నిత్య పూజలకు విరామం: శ్రీ మఠంలో బుధవారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, పరిమళ ప్రసాదం బంద్ చేస్తారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం నిర్వహించి మూలరాములకు పూజలు చేసి మహా మంగళ హారతులు ఇస్తారు. అలంకరణ లేని రాఘవేంద్ర స్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకొనే అవకాశం మాత్రమే శ్రీ మఠం అధికారులు కల్పించనున్నారు.

రేపటి నుంచి ఉల్లి కొనుగోళ్లు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో శుక్రవారం నుంచి ఉల్లి కొనుగోళ్లను ప్రారంభిస్తున్నట్లు మార్కెట్ ప్రత్యేకశ్రేణి కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, మార్క్ఫెడ్, మార్కెటింగ్ శాఖ జేడీలు ఉల్లి కొనుగోళ్ల కేంద్రం ఏర్పాటు చేయాలని తెలిపారన్నారు. దీంతో స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటిలో ఈనెల 18, 19 తేదిలు గురు, శుక్రవారాల్లో ఉల్లిని కొనుగోలు చేస్తామన్నారు. రైతులు ఆరబెట్టిన ఉల్లిని మాత్రమే పరిమితంగా తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఉల్లి సాగుచేసిన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సభను జయప్రదం చేయాలి

కౌతాళం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి 10వ ఆవిర్భావ దినోత్సవ సభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా జేఏసీ అధ్యక్షుడు శాంతరాజు తెలిపారు. అక్టోబరు12న విజయవాడ ఎంబివికే విజ్ఞాన కేంద్రములో దశాబ్ద ఐక్యత-భవిష్యత్తు పోరాట సభ పేరిట సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు రమేష్, ఉద్యోగులు మాబాష, హైమవతి, రమణ, వరద రాజులు ఉన్నారు.

నేడు సురవరం సంస్మరణ సభ

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నేడు ఎమ్మిగనూరు పట్టణంలోని తేరుబజారులో గురువారం జరిగే సురవరం సుదాకర్‌రెడ్డి సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న కోరారు. కమ్యూనిజం సిద్ధాంతాల కోసం పనిచేసిన సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభకు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలనికోరారు.

'కార్యకర్త కుటుంబానికి పార్టీ అండ'

మంత్రాలయం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్యకర్త కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని టీడీపీ నాయకులు అన్నారు. మాధవరం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త ఉలువ భీమన్న తల్లి ఉలువ నరసమ్మ (68) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి సోదరుడు టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి మృతదేహనికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయ్ కుమార్,గూర్కింటి భీమిరెడ్డి, నాగరాజు,ఈడిగ రాఘప్ప తదితరులు పాల్గొన్నారు.

బారికేడ్ల తొలగింపు

మంత్రాలయం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో నాగలదిన్నె రోడ్డులో మూలరామ వసతి గృహం ముందు బాగాన శ్రీమఠం అధికారులు ఏర్పాటు చేసిన బారికేడ్లను ఆర్అండ్‌బీ అధికారులు తొలగించారు. గత నెల ఆగస్టులో నాగలదిన్నె రోడ్డులో ఆర్అండ్‌బీ రోడ్డుపైనే భారీ కేడ్లను శ్రీమఠం అధికారులు శాశ్వతంగా నిర్మించారు. దీనిపై గ్రామస్థులు, భక్తులు ఆర్అండ్‌బీ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. జిల్లా కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పిర్యాదు చేశారు. ఈ పిర్యాదు మేరకు శ్రీమఠం అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోకపోవడంతో మంగళవారం జేసీబీతో శాశ్వతంగా ఏర్పాటు చేసిన భారీ కేడ్లను తొలగించారు. డీఈ నాగరాజు, ఏఈ విజయ నరేష్‌లు తొలగించారు. దీంతో గ్రామస్థులు, వాహనదారులు భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

పిల్లలకు ఆస్తులు కాదు.. చదువును ఇవ్వండి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు పిల్లలకు ఆస్తులు కాదు ఇవ్వాలసింది, ధైర్యంగా బ్రతకడానికి కాలసిన చదువు ఇవ్వాలని నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర డైరెక్టర్ విజయ్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక కోర్టులోని సీతారామంజనేయ స్వామి దేవాలయంలో జరిగిన సమావేశంలో మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలు, పోలీస్ శాఖలో ఉద్యోగాలు, నీట్‌లో లో సీట్లు సాధించిన వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ నరసయ్య, యల్లప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పంట నమోదు చేసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శివశంకర్

ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 16(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు పంట నమోదు చేసుకోవాలని ఏవో శివశంకర్ తెలిపారు. మంగళవారం మండల పరిదిలోని కడివెళ్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మండలపరిదిలోని ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేకోవాలని సూచించారు. వీఏఏ హనుమేష్, ఏఈఓ వినోద్ పాల్గొన్నారు.

చెత్త సేకరణపై అవగాహన



చెత్తను పరిశీలిసుస్తున్న అదనపు ఎంపీడీవో

నందవరం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని రాయచోటి గ్రామంలో మంగళవారం చెత్త సేకరణపై పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో చెత్త సేకరణపై అవగాహన కల్పించారు..గ్రామ పరిశుభ్రత, ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం నిత్యం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమం మాజీ మార్కెట్‌యార్డు డైరెక్టర్ రామకృష్ణా రెడ్డి, సురేంద్రరెడ్డి, తెలుగు శ్రీను, పారిశుధ్య కార్మికుడు ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

'దళిత, బడుగు, బలహీన వర్గాలంటే చిన్నచూపా?'



ఎంపీడీవోతో వాగ్వాదం చేస్తున్న ఎంపీటీసీ శశిరేఖ

పెద్దకడబూరు , సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో సొసైటి అధ్యక్షుడికి ఎంపీపీ వరుసలో సీటు కేటాయించిన పుడు .ఇప్పుడెందుకు సీటు కేటాయించడంలేదని హనుమాపురం ఎంపీటీసీ నరవశశిరేఖ అధికారులపై మండిపడ్డారు. సొసైటీ చైర్మన్ దళిత, బడుగు, బలహీన వర్గాలకు చెందిన చైర్మన్‌లు అంటే చిన్నచూపు చూస్తున్నారని ఎంపీడీవోను నిలదీశారు. మంగళవారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ శ్రీవిద్య అధ్యక్షతన నిర్వహించారు. ప్రొటోకాల్ గతంలో గుర్తుకు రాలేదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండ చూసుకోవాలన్నారు. పారిశుధ్యం చాలా గ్రామాల్లో పడకేసిందని చెప్పినా వాళ్లు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జడ్పీటీసీ సభ్యులు, రాజేశ్వరి, వైస్ ఎంపీపీ ముక్కమ్మ, ఆయా మండలాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాఠశాలలు సరైన నిర్మాణ ప్రమాణాలను పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు ఉదమ్, శేఖర్, రఘులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కర్నూలులోని డీఈవో శ్యామ్‌పాల్‌కు వినతి పత్రాన్ని అంద జేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలు సరైన మౌలిక వసతులు కల్పించకపోవడం బాదాకరమని అన్నారు. సరైన పర్మిషన్లు లేకపోయినా ఉన్నట్లుగా అధికారులు సృష్టించి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం అడుతున్నారని అన్నారు. పాఠశాలలు సరైన ప్రమాణాలతో లేకపోయిన పర్మిషన్లు ఇచ్చిన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఖాజా, ఆఫ్రిది పాల్గొన్నారు.

పదోన్నతుల కోసం పోరాడాలి



వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతుల కోసం పోరా టం చేయాలని యూటీఎఫ్ నాయకులు భాస్కర్, రాజు, సుధాకర్ కోరారు. మంగళవారం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రణభేరి బైకు యాత్ర ఎమ్మిగనూరుకు చేరింది. రాష్ట్ర నాయకులు సురేష్, లక్ష్మీ, రాజా, జితేంద్రలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు పదోన్నతుల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.